# జనపదం
J A N A P A D H A M

హైదరాబాద్ | గురువారం 31 అక్టోబర్ 2024 | సంచిక: 1 సంపుటి: 143

తెలుగు దినపత్రిక


## టీటీడీ బోర్డు చైర్మన్ గా నాయుడు..



- 24 మంది సభ్యులతో పాలక మండలి..
- తెలంగాణ నుంచి ఐదు గురికి అవకాశం..
- అధికారికంగా ప్రకటించిన దేవస్థానం

..........వివరాలు 2లో



## చీకట్లు తొలగిపోయాయి

- ప్రజాహితం దిశగా కాంగ్రెస్ పాలన
- సీఎం రేవంత్ రెడ్డి
- రాష్ట్ర ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు

బీఆర్ఎస్ హయాంలోని పదేండ్ల విధ్వంసపు పాలనలోని చీకట్లు తొలగిపోయాయని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమం అభివృద్ధి లక్ష్యంగా ప్రజా పాలనలో తెలంగాణ వెలుగులు విరజిమ్ముతుందని ధీమా వెలిబుచ్చారు. దీపావళి పండుగను పురస్కరించుకుని రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన ఆయన చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే ఈ పండుగను రాష్ట్రంలోని ప్రజలందరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. దీపాల కాంతులతో ప్రతి ఇంటా సుఖ సంతోషాలు వెల్లివిరియాలని కోరుకున్నారు. పర్యావరణానికి హాని కలిగించకుండా చిన్నా పెద్దలందరూ పండుగ జరుపుకోవాలని, ప్రమాదాలకు తావు లేకుండా జాగ్రత్తలు పాటించాలని సీఎం విజ్ఞప్తి చేశారు. - జనపదం, బ్యూరో



# అయ్యో..?!

## కైలాసం టు పాతాళం.. చిక్కుల్లో ఐఏఎస్ లు..

- చుట్టుకుంటున్న గత పాపాల చిట్టా..
- భూ అక్రమాల్లో విచారణ ఎదుర్కొంటున్న అమయ్ కుమార్
- ల్యాండ్ తారుమారు చేశారంటూ మరో ఇద్దరిపైనా..
- నవీన్ మిట్టల్, సోమేశ్ పై ఈడీకి బాధితుల ఫిర్యాదు
- నకిలీ డాక్యుమెంట్లు సృష్టించారని మరీ ఆరోపణలు..
- ఇప్పటికే జీఎస్టీ కుంభకోణంలో మాజీ సీఎస్..
- సివిల్ సర్వెంట్లకు చుట్టుకుంటున్న పాత చిట్టాలు...

జనపదం, బ్యూరో

ఐఏఎస్.. ఆ పోస్టు అంటేనే దేశంలో అంతకు మించిన హోదా ఉండదు. యావత్తు సమాజానికి దిశానిర్దేశం., ప్రజా జీవన విధానాలను ప్రభావితం చేసే నిర్ణయాలు తీసుకునే హుందాతనం., సర్కార్ కు జనాలకు మధ్య వారధిగా దేశ పోకడనే నడిపే కీలకమైన విధి నిర్వహణ. చట్టాలు రూపకల్పన చేసే సభలు ఒకవైపు.., అవి రూపొందించిన శాసనాల ఫలాలు అందుకునే జనాల మరోవైపు.. ఇలా భిన్నమైన కత్తి అంచుల వంటి ధ్రువాల మధ్య ఎంతో ఓర్పుగా, సహనంతో చాకచక్యంగా సాగాల్సిన గౌరవప్రదమైన పెద్దరికం. అంతటి కఠినమైన పరీక్షలను ఎదుర్కొంటూ ముందుకెళ్లే పెద్దరికం ఎక్కడైనా బ్యాలెన్స్ తప్పితే మొదటికే మోసం., నిండా మునిగాల్సిన ఘోరం. కీలకమైన స్థానంలో ఉన్న వారు దుర్వినియోగానికి పాల్పడితే ఆ తర్వాత అంతకుమించిన అధ:పాతాళానికి తొక్కేయబడడం ఖాయం. ఆ ఐఏఎస్ లను తలుచుకుంటే అయ్యో.. ......(తరువాయి 4లో)

ఎగిసెగిసి పడితే ఎల్లెల్కల పడడానికి కూడా సిద్ధమై ఉండాలి. కన్నూమన్నూ కానకుండా ప్రవర్తిస్తే కండ్ల ముందు అగాధం కనిపిస్తున్నా కూరుకుపోవడానికి రెడీగా ఉండాల్సిందే. ప్రభుత్వ పెద్దలు సహకరిస్తున్నారు., ప్రసన్నం చేసుకుంటూ మెట్లెక్కచ్చు అని భ్రమపడితే అది కైలాసంలో నిచ్చెన మాదిరి షార్ట్ కట్ తప్ప మెయిన్ ఎంట్రన్స్ కానే కాదు. అంతటి వేగంగా సాగే ఆటలో ఒక్క పాము గనుకు ఎదురైతే అప్పుడు తెలుస్తుంది మనమెంత ఆటగాళ్లమో అని. ఎంత తక్కువ సమయంలో పైకెక్కామో.., అంతకు రెట్టింపు వేగంతో పాతాళానికి పడి పీకల్లోతుల్లో కూరుకుపోతాం. ఈ ఐఏఎస్ ల తీరు చూస్తుంటే కూడా అచ్చు అలాగే అనిపిస్తున్నది. గత సర్కార్ హయాంలో ఎదురే లేదన్నట్టుగా చలాయించుకున్న వీరు ఇప్పుడు ఎన్నో వలయాల్లో ఇరుక్కుని గిలగిలా కొట్టుకుంటున్నారు. వేలకోట్ల భూ కుంభకోణాల్లో చిక్కుకుని విచారణలకు హాజరవ్వాల్సిన దయనీయ స్థితిలో సివిల్ సర్వెంట్లు కాస్త ఛీవిల్ సర్వెంట్లుగా మారుతున్నారు.



# మోదీపై యుద్ధం..

## జనగణనకు దీటుగా కులగణన..

- డాక్యుమెంట్ రూపంలో కేంద్రానికి పంపాలి..
- అన్ని జిల్లాలకు పరిశీలకుల నియామకం
- నవంబర్ 2న అన్ని జిల్లా కేంద్రాల్లో డీసీసీ భేటీలు
- రాష్ట్రస్థాయిలో అఖిలపక్షంతో మరో సమావేశం
- వచ్చే నెల 5న రాహుల్ తో చివరి భేటీ
- గాంధీభవన్ లో కంట్రోల్ రూం ఏర్పాటు
- నవంబర్ లోగా ప్రక్రియ పూర్తికి ఆదేశం
- గాంధీభవన్ లో కులగణనపై అవగాహన కార్యక్రమంలో సీఎం రేవంత్

జనపదం, హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న కుల గణన భవిష్యత్తులో కేంద్ర ప్రభుత్వం చేపట్టే జనగణనకు ఆదర్శంగా ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. తెలంగాణ విధానాన్ని ఆదర్శంగా తీసుకునేలా మన విధానాన్ని డాక్యుమెంట్ రూపంలో కేంద్రానికి పంపుతామని వెల్లడించారు. ఈ క్రమంలో నవంబర్ 6 నుంచి జరుపతలపెట్టిన కులగణనను సమన్వయం చేసుకునేందుకు 33 జిల్లాలకు పరిశీలకులను నియమిస్తామని వివరించారు. నవంబర్ 30లోగా కులగణన పూర్తి చేసి భవిష్యత్ యుద్ధానికి సిద్ధం కావాలని పార్టీ ......(తరువాయి 4లో)

తెలంగాణ ఓ ప్రత్యేకం. రాజకీయమైనా.., పనిలోనైనా దాని ఐడెంటిటీ దానిదే. కులగణన విషయమై వేగంగా వ్యూహరచన చేస్తూనే కేంద్రంలో వచ్చే యేడాది చేపట్టబోయే జనగణనకు మార్గనిర్దేశంగా ఉండాలని శ్రమిస్తున్నది. యావత్ దేశమంతా చేసే జనాభా లెక్కలకు మన ప్లానింగ్ ను కాపీ కొట్టి అనుసరిస్తే అంతకన్నా అదృష్టం ఏముంటదని స్వయంగా సీఎం రేవంత్ మంత్రివర్గం, ఇతర సిబ్బందిని ఉద్దేశించి చెప్పారు. కుల గణనకు మనం అనుసరించే వ్యూహాలు, తీసుకునే చర్యలు జనగణనకు షార్ట్ కట్ మాదిరిగా ఉండాలని ఆకాంక్షించారు. దేశమంతా మన పనితీరును మెచ్చుకోవాలంటే అంతాకలిసి కులగణనను సమర్థవంతంగా పూర్తిచేయాలని, డెడ్ లేన్ ను విధించుకుని పనిలో నిమగ్నమవ్వాలని కోరారు.



## ఇరికిస్తారనే పారిపోయా..

- పోలీసుల ముందుకు రాజ్ పాకాల..
- జన్వాడ ఘటన అనంతరం మాయం..
- నేడు న్యాయవాదితో కలిసి పోలీసుల ఎదుట హాజరు
- ఫాం హౌస్ కు తీసుకెళ్లిన మోకిల పోలీసులు
- ఆధారాలు నిల్.. తిరిగి స్టేషన్ లోనే విచారణ
- విజయ్ మద్దూరి స్టేట్మెంట్ ఆధారంగా ఎంక్వైరీ
- మొబైల్ ఫోన్ కోసం ఆరా..

2




## అదేం లెక్కా..?

- ఏదైనా ఉంటే డెడికేషన్ గా చేయాలి..
- బీసీ రిజర్వేషన్ల అమలుపై డెడికేటెడ్ కమిషన్..?
- రాష్ట్ర సర్కార్ కు హైకోర్టు ఆదేశం
- స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లపై కీలక హుకుం
- రిజర్వేషన్లపై అధ్యయనాన్ని బీసీ కమిషన్ కు అప్పజెప్పడం సరికాదని వ్యాఖ్య

4



## టీచర్ల సాయం కావాలె..

- కుల గణన సర్వేలో ఉపాధ్యాయులను భాగస్వామ్యం చేస్తున్నాం
- సర్వే కోసం సంఘాల సూచనలు ఆచరణలో పెడతాం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం..

4

# మూసీని అమ్ముకునే కుట్ర

- ఫాం హౌస్ కే కేసీఆర్ పరిమితం
- రేవ్ పార్టీల్లో తిరుగుతున్న కేటీఆర్
- కేంద్రం నిధులు మళ్లిస్తున్న రాష్ట్ర సర్కార్
- కరెంటు బిల్లులు కట్టలేని స్థితిలో జీపీలు
- ఇందిరమ్మ కమిటీలు చెల్లుబాటు కావు..
- కోర్టుకు వెళ్లి అడ్డుకుంటాం
- బీజేపీ ఎంపీ రఘునందన్ రావు



2



## అభివృద్ధి పేరుతో కమిషన్ల దందా

- కాంగ్రెస్ పాలనంతా అవినీతిమయం
- జీవోలను పబ్లిక్ డొమైన్ లో పెట్టని సర్కార్
- ఢిల్లీకి మూటల పంపిణీపైనే శ్రద్ధ
- రూ.1150 కోట్ల సివిల్ సప్లయ్ కుంభకోణంపై చర్యలేవి
- రాష్ట్ర సర్కార్ అవినీతిపై కేంద్రానికి ఫిర్యాదు చేస్తాం
- బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి

2

## బ్యాంక్ లో బంగారం గుట్టలు..

- ఆర్బీఐలో భారీగా పెరిగిన పసిడి నిల్వలు
- 855 టన్నుల గోల్డ్ నిల్వలు
- విదేశాల నుంచి తరలించిన సొమ్మే అధికం..

3

# దీపావళి ధమాకా..

- ఉద్యోగులకు 3.64 శాతం డీఏ
- ఉత్తర్వులు జారీ చేసిన సర్కార్
- 2022 జులై ఒకటో తేదీ నుంచి వర్తిస్తుందని వెల్లడి
- హర్షం వ్యక్తం చేస్తున్న ఎంప్లాయిస్..




జనపదం, హైదరాబాద్ బ్యూరో :

రాష్ట్ర సర్కార్ ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త వినిపించింది. ఇటీవల రాష్ట్ర మంత్రి వర్గ భేటీలో నిర్ణయం తీసుకుని ప్రకటించినట్టు దీపావళి పండగ సందర్భంగా ఒక డీఏను ప్రకటించింది. 3.64 శాతం కరవు భత్యం పెంచుతూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇది జులై 01,2022 నుంచి వర్తిస్తుందని వెల్లడించింది. పెరిగిన డీఏ నవంబర్ జీతంతో కలిపి చెల్లిస్తున్నట్లు వివరించింది. పెరిగిన డీఏను పరిశీలిస్తే జులై 1,2022 నుంచి అక్టోబర్ 31,2024వరకు డీఏ బకాయిలు జీపీఎఫ్ ఖాతాలో జయ చేయనున్నారు. మార్చి 31, 2025 లోపు పదవీ విరమణ చేసే ఉద్యోగులకు డీఏ బకాయిలు 17 సమాన వాయిదాల్లో చెల్లింపులు చేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం తాజా ఉత్తర్వుల్లో పేర్కొంది. సీపీఎస్ ఉద్యోగులకు డీఏ బకాయిలు 10 శాతం ప్రాన్ ఖాతాకు జమ చేస్తారు. 90 శాతం 2025 ఫిబ్రవరి నుంచి 17 సమాన వాయిదాల్లో చెల్లింపులు చేయనున్నారు. జీపీఎఫ్ ఖాతాలు లేని ఫుల్ టైం కంటింజెంట్ ఉద్యోగులకు 2025 ఫిబ్రవరి నుంచి 17 సమాన వాయిదాల్లో చెల్లింపులు చేస్తారు. విశ్రాంత .. (తరువాయి 4లో)

# చిన్నకుండా చూస్కో..

## సీఎం సీటు కిందే 'సీనియర్' బాంబులు..

- ఏ క్షణంలోనైనా పేలే అవకాశం..
- ముఖ్యమంత్రి పదవి కేసీఆర్ భిక్ష
- మాట మీద నిలబడని ముఖ్యమంత్రివి
- పాదయాత్రకు సిద్ధం.. తేదీ., సమయం చెప్పు..
- సీఎం రేవంత్‌కు మాజీ మంత్రి హరీష్ రావు సవాల్
- ముందు తమను ఢీకొట్టి తర్వాత కేసీఆర్ దాకా వెళ్లాలని సవాల్..



జనపదం, హైదరాబాద్ బ్యూరో:

రేవంత్ రెడ్డి సీఎం కుర్చీకి ఉన్న గౌరవం పోగొడుతున్నారని మాజీమంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. బుధవారం తెలంగాణ భవన్ లో మీడియాతో హరీష్ రావు ఇష్టాగోష్టిగా మాట్లాడారు. రేవంత్ రెడ్డి కుర్చీ కింద ఉన్న బాంబ్ గురించి చూసుకోవాలని రేవంత్ కుర్చీని ఎవరు, ఎప్పుడైనా లాగొచ్చని హెచ్చరించారు. పక్కన ఉన్నవారు ఫినిష్ చేయకుండా చూసుకోవాలని, సీఎం పదవి కేసీఆర్ పెట్టిన భిక్ష అని స్పష్టం చేశారు. హైదరాబాద్ కు మూడు దిక్కుల సముద్రం ఉందన్న రేవంత్ కామెంట్స్ పై సోషల్ మీడియాలో జోకులు పేలుతున్నాయని, రాజీవ్ గాంధీ కంప్యూటర్ కనిపెట్టాడని అంటాడని, దిల్ సుఖ్ నగర్ లో విమానాలు అమ్ముతారని రేవంత్ అనడం హాస్యాస్పదమన్నారు. మల్లన్న సాగర్‌లో 50,000 ఎకరాలు ముపునకు గురైందని ముఖ్యమంత్రి అబద్ధపు ప్రచారం చేస్తున్నారని, మొత్తం ప్రాజెక్ట్ ......(తరువాయి 2లో)

# మూసీని అమ్ముకునే కుట్ర

- కేసీఆర్ ఫాం హౌస్‌కే పరిమితం
- రేవ్ పార్టీల్లో తిరుగుతున్న కేటీఆర్
- కేంద్రం నిధులు మళ్లిస్తున్న రాష్ట్ర సర్కార్
- కరెంటు బిల్లులు కట్టలేని స్థితిలో జీపీలు
- ఇందిరమ్మ కమిటీలు చెల్లుబాటు కావు..
- కోర్టుకు వెళ్లి అడ్డుకుంటాం
- బీజేపీ ఎంపీ రఘునందన్ రావు



**జనపదం, బ్యూరో:** కేసీఆర్ మాదిరాగానే రేవంత్ రెడ్డి మూసీని అమ్ముకునే ప్రయత్నం చేస్తున్నారని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు ఆరోపించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. గ్రామ పంచాయతీలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని మండిపడ్డారు. అలాగే ఇందిరమ్మ కమిటీల ద్వారా ఇళ్లను పంపిణీ చేయడాన్ని బీజేపీ వ్యతిరేకిస్తోందన్నారు. బీఆర్ఎస్ స్థానంలోకి బీజేపీ పోదని.. బీఆర్ఎస్ కు ప్రజలు రిటైర్ మెంట్ ఇచ్చారని చెపపారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందని, ప్రజలు రానున్న రోజుల్లో గుండెల్లో పెట్టుకుంటారని చెప్పారు. కేసీఆర్ ఫామ్ హౌస్ కే పరిమితమయ్యారని, కేటీఆర్ రేవ్ పార్టీలని తిరుగుతున్నారని విమర్శించారు. అవినీతిపరులను అరెస్ట్ చేస్తే స్వాగతిస్తామని పేర్కొన్నారు. ఆరు నెలల కింద కేంద్రం ఉపాధి పథకం కింద 12వందల కోట్లు విడుదల చేసిందని చెప్పారు. గ్రామ పంచాయతీల్లో కరెంటు బిల్లులు కట్టలేని పరిస్థితి నెలకొందని, రేవంత్ సర్కార్ గ్రామ పంచాయతీలను ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందన్నారు.

### సొమ్ము కేంద్రానికి.. పేరు ఇందిరమ్మది..

సొమ్ము కేంద్రానికి అయితే ఇందిరమ్మ పేరు పెట్టారని, ఇందిరమ్మ కమిటీలు ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేస్తే అడ్డుకుంటామన్నారు. ఇందిరమ్మ కమిటీలకు ఒక విధానం లేదని, గతంలో సిరిసిల్ల, సిద్దిపేను సుడా చేసుకునారని, ఇప్పుడు రేవంత్ రెడ్డి కొడంగల్ ను కుడా చేసుకున్నారని విమర్శించారు. గ్రామ సభలు పెట్టి లబ్ధిదారులను ఎంపిక చేయాలని సూచించారు. గ్రామ పంచాయతీలకు ఎన్నికలు పెట్టే ధైర్యం రాష్ట్ర ప్రభుత్వానికి లేదన్నారు. ఇందిరమ్మ కమిటీలు చెల్లుబాటుకాదని, దీనిపై న్యాయస్థానికి వెళ్తామని పేర్కొన్నారు. కేసీఆర్ మాదిరగానే రేవంత్ రెడ్డి సైతం మూసీని అమ్ముకునే ప్రయత్నం చేస్తున్నారని, మూసీ సుందరీకరణ పేరుతో డబ్బులు దండుకోవాలని చూస్తున్నారన్నారు.

### ఏ బాంబు పేలుస్తారో చూస్తాం

మున్సిపాలిటీలలో 250 కోట్ల రూపాయలు కేంద్ర ప్రభుత్వం తాగునీటి కోసం విడుదల చేసిందన్నారు. ప్రతి స్కీంకు ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ పేర్లు పెట్టే భావదారిద్ర్యం ఉందని, మూసీ శుద్ధి, సుందరీకరణకు మేం వ్యతిరేకం కాదన్నారు. అభివృద్ధి పేరుతో కార్పోరేట్ కంపెనీలకు పనులు అప్పజెబితే మాత్రం వ్యతిరేకిస్తామని, మూసీకి కొండ పోచమ్మ సాగర్ నుంచి నీరు తెస్తే 1500 కోట్ల రూపాయలు ఖర్చవుతాయని, మల్లన్న సాగర్ నుంచి నీరు తెస్తే 7వేల కోట్ల రూపాయలు ఖర్చు అవుతుందని చెప్పారు. పేదోళ్లు కట్టిన ఇంటి వద్ద 50 మీటర్ల దూరం అభివృద్ధి చేస్తామంటున్నారని, మూసీ అభివృద్ధిలో క్విడ్ ప్రోక్రో ఉన్నట్లు అనుమానం ఉందన్నారు. ప్రజలు బీఆర్ఎస్‌కు సీఆర్ఎస్ ఇచ్చారు.. వారిని ఫాం హౌస్‌లకు పరిమితం చేశారు. పేదోళ్లకు కట్టించేందుకు కేంద్ర ప్రభుత్వం ఎన్ని నిధులైనా ఇస్తుందని, కుక్కతోక పటాకులు పేలుస్తారా .. సుతీల్ బాంబు పేలుస్తారా చూడాలన్నారు. అదిపేలుస్తాం ఇది పేలుస్తాం అని బ్రేకింగ్ ప్లేట్ల కోసం మాట్లాడకుండా అవినీతిపరులను అరెస్టు చేస్తే మేం స్వాగతిస్తామని ఎంపీ రఘునందర్ రావు వెల్లడించారు.

### నిధులు కావాలి.. పేరు మాత్రం చెప్పరు

కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం రెకమండేషన్ మేరకు రూ.500 కోట్లు విడుదల చేసిందని.. నేషనల్ హెల్త్ మిషన్ కోసం 300 కోట్ల రూపాయలు విడుదల చేసిందని చెప్పారు. 5-6 వందల మందికి ఒక హెల్త్ సెంటర్ నిర్మాణం చేయాలని చెప్పిందన్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం నిర్వాకంతో గ్రామాలలో జ్వరాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం రెండు వేల కోట్ల రూపాయలు విడుదల చేసినా తెలంగాణ సర్కార్ వాటిని దారి మళ్లించిందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం నిధులు కావాలి కానీ కేంద్రం పేరు చెప్పేందుకు మనసు రాదంటూ మండిపడ్డారు. నియోజకవర్గానికి 3,500 ఇల్లు కట్టిస్తామని చెప్పిందని.. వాటిని కట్టేందుకు కూడా రాష్ట్ర ప్రభుత్వం వద్ద నిధులు లేవని.. ఆ నిధులను కూడా అర్బన్ మిషన్ కింద సేకరిస్తోందన్నారు. వాటిని ఎవరు పంచాలనేది దానిపై కొట్లాట మొదలైందన్నారు. కలెక్టర్లతో కాకుండా గ్రామాల్లో కాంగ్రెస్ కార్యకర్తల చేతుల మీదుగా ఆ నిధులు అందజేస్తామని చెబుతున్నారన్నారు.

# చిన్నగకుండా చూస్కో..



(మొదటిపేజీ తరువాయి) సేకరించిన భూమి 17, 871 ఎకరాలని స్పష్టం చేశారు. నిర్వాసితులకు 2013 చట్టం కంటే మెరుగైన ప్యాకేజీ ఇచ్చామని, అవన్నీ ప్రభుత్వ రికార్డులే అని. తెప్పించుకుని చూడాలని, కళ్ళు తెరిచి మాట్లాడాలని సలహా ఇచ్చారు.

### మళ్లీ ఎందుకు పోటీ చేశావ్

కొడంగల్‌లో ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానని చెప్పి, మళ్లీ వచ్చి మల్కాజ్‌గిరిలో పోటీ చేశాడని హరీశ్రావు ఎద్దేవా చేశారు. ఆగస్టు 15లోగా రుణమాఫీ పూర్తి చేస్తామని మాట తప్పాడని, మాట మీద నిలబడని ముఖ్యమంత్రిగా రేవంత్ చరిత్రలో నిలుస్తారన్నారని విమర్శించారు.. 31 రకాల సాకులతో రుణమాఫీ ఎగ్గొట్టారని, దాన్ని పూర్తి రుణమాఫీ కాదు పాక్షిక రుణమాఫీ అంటారన్నారు. ఏడాది పూర్తి అవుతున్నా ఇంకా పూర్తి క్యాబినెట్ వేయలేక పోయారని, రాష్ట్రం సమస్యల కుప్పగా మారిందన్నారు. ముఖ్యమంత్రి చేయాల్సిన పనులు పక్కన పెట్టి రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు.

### కేసీఆర్ పెట్టిన భిక్ష..

రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి పదవి కేసీఆర్ పెట్టిన భిక్ష అని, కేసీఆర్ ఇస్ ఏ సేవియర్ అండ్ ప్రొటెక్టర్ ఆఫ్ తెలంగాణ అని హరీశ్రావు స్పష్టం చేశారు. తన గురించి, కేటీఆర్ గురించి మాట్లాడుతున్నారని, అలా మాట్లాడిన వాళ్ళు ఎటు పోయారో చూశామన్నారు. ముందు ఆయన పక్కన ఉన్నవాళ్లు ఆయన్ను ఫినిష్ చేయకుండా చూసుకోవాలని సలహా ఇచ్చారు. రాష్ట్రంలో ఇప్పుడు ఎన్నికలు వస్తే 100 సీట్లు బీఆర్ఎస్‌కు వస్తాయని హరీశ్రావు చెప్పారు.

### సీఎం కుర్చీ కోసం..

రాష్ట్ర మంత్రి ఇటీవల గవర్నర్‌ను కలిశాడని, మరో మంత్రి హెలికాప్టర్ లేదని అలిగాడని, ఇంకో మంత్రి రెండు, మూడు సార్లు ఢిల్లీ వెళ్ళాడని హరీశ్రావు సెటైర్ వేశారు. కేబినెట్లోని మరో ఇద్దరు ముగ్గురు మేము సీఎం అవుతాము అని సోషల్ మీడియా లో పెట్టుకుంటున్నారని వ్యాఖ్యానించారు.

### రియల్‌ఎస్టేట్ చేస్తే ఊరుకోం..

మూసీ పైన తమ విజన్ ఎప్పుడో చెప్పామని, మూసీ రీజనరేషన్ కు తాము అనుకూలమేనని హరీష్ రావు స్పష్టం చేశారు. అలాకాకుండా సుందరీకరణ పేరిట రియల్ ఎస్టేట్ వ్యాపారానికి పాల్పడితే మాత్రం వ్యతిరేకించి తీరుతామని హెచ్చరించారు. కాళేశ్వరం నుంచి గోదావరి నీళ్లు మూసీకి తీసుకురావడానికి ఎప్పుడో డీపీఆర్ సిద్ధం అయిందని, రూ.1100 కోట్లతో అయ్యే దానికి 7 వేల కోట్లు ఎందుకు పెడుతున్నారని హరీశ్రావు ప్రశ్నించారు. గచ్చిబౌలి లో కేసుల్లో ఉన్న 400 ఎకరాలు భూమిని ప్రభుత్వం గెలిచిందని, ఆ భూమిలో మూసీ బాధితులకు, పేదలకు 200 గజాల చొప్పున ఇవ్వాలని సీఎంకు సూచించారు.

### విధుల్లోకి తీసుకోవాలి..

ఏక్ పోలీస్ అమలు చేయమంటే సస్పెండ్ చేయటం అన్యాయమని, ఏక్ పోలీస్ అమలు చేస్తామని ఎన్నికల్లో రేవంత్ చెప్పలేదా..? అని హరీష్ రావు ప్రశ్నించారు. తనకు రక్షణ కల్పించే పోలీసులపై కూడా రేవంత్ కు నమ్మకం లేకుండా పోయిందన్నారు. తండ్రే తన పిల్లలను నమ్మనట్లు రేవంత్ తీరుందని, కానిస్టేబుల్స్ సమస్యలు తెలుసుకునే సమయం లేదా అని ప్రశ్నించారు. బాపూఘాట్ లో భారీ గాంధీ విగ్రహం పెడితే స్వాగతిస్తామన్నారు. కేసీఆర్ పెట్టిన అంబేద్కర్ విగ్రహానికి దండం పెట్టడని, ప్రజలు దర్శించుకునే అవకాశం ఇవ్వడని, రేవంత్ రెడ్డి తప్పిదాల వలన హైదరాబాద్ లో రియల్ ఎస్టేట్ డమాల్ అయిందన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా గోల్ కొట్టేది తామేనని, వికెట్ తీసేది కూడా తామేనని, ఈ లోపు హిట్ వికెట్ కాకుండా చూసుకోవాలని రేవంత్రెడ్డిని హరీశ్రావు హెచ్చరించారు.

### వంద సీట్లు పక్కా..

రాష్ట్రంలో ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగినా బీఆర్ఎస్ కు వందసీట్ల కు తగ్గవని హరీశ్ రావు అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీలను నమ్మి రాష్ట్ర ప్రజలు మోసపోయారన్నారు. రేవంత్ పాలన ను కేవలం ఆరు నెలల్లోనే ప్రజలు గ్రహించారన్నారు. ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేని అసమర్థుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని మండిపడ్డారు. ఆయనకు పాలన అనుభవం లేని కారణంగానే రాష్ట్రంలోని ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రోడ్లపైకి వచ్చి నిరసనలు చేస్తున్నారన్నారు.

### గెలుపోటములు సహజం..

రాజకీయాల్లో గెలుపు ఓటములు సహజం అన్నారు. అంతమాత్రాన కేసీఆర్ పని అయిపోయింది అంటూ రేవంత్ చేసిన వ్యాఖ్యలపై ఆయన తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఇందిరాగాంధీ ఓడి పోయారు, రాహుల్ గాంధీ సైతం ఓడి పోయారన్నారు. అంత మాత్రాన రాజకీయంగా వారి పని అయిపోయిందా అని ప్రశ్నించారు. రాజకీయాలు అన్నప్పుడు ఎత్తుపల్లాలు ఉండడం ప్రతిపార్టీకి ప్రతినాయకుడికి సహజమన్నారు. అంతమాత్రాన రాష్ట్రం ప్రజలు కేసీఆర్ ఎలా మరిచిపోతారన్నారు. రేవంత్ ఇంకా ముఖ్యమంత్రి స్థాయిలో కాకుండా పీసీసీ అధ్యక్ష హోదాలో ఉన్నట్లుగానే మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. తన గురించి, కేటీఆర్ గురించి రేవంత్ అడ్డగోలుగా మాట్లాడుతున్నాడన్నారు. అలా మాట్లాడిన వాళ్ళు ఎటు పోయారో చూశామని హెచ్చరించారు. ముందు నీ పక్కన ఉన్నవాళ్లు నిన్ను ఫినిష్ చేయకుండా చూసుకో అంటూ మాజీ మంత్రి హరీష్ రావు చురకలు అంటించారు.



## టీటీడీ చైర్మన్ గా బీఆర్ నాయుడు

### తెలంగాణ నుంచి ఐదుగురికి స్థానం

### పేర్లను అధికారికంగా ప్రకటించిన టీటీడీ..

**జనపదం, అమరావతి:** తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పాలక మండలి నూతన చైర్మన్ గా బీఆర్ నాయుడు నియమితులయ్యారు. 24 మంది సభ్యులతో టీటీడీ పాలకమండలి ఏర్పాటు కానుంది. ఈ మేరకు టీటీడీ అధికారిక ప్రకటన విడుదల చేసింది.

**టీటీడీ బోర్డు సభ్యులు వీరే..**

జ్యోతుల నెహ్రూ (జగ్గంపేట ఎమ్మెల్యే)
వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి (కోవూరు ఎమ్మెల్యే)
ఎం.ఎస్ రాజు (మడకశిర ఎమ్మెల్యే)
పనబాక లక్ష్మి (కేంద్ర మాజీ మంత్రి)
జాస్తి పూర్ణ సాంబశివరావు
నన్నూరి నర్సిరెడ్డి (తెలంగాణ)
శ్రీసదాశివరావు నన్నపనేని
కృష్ణమూర్తి ( తమిళనాడు)
కోటేశ్వరరావు
మల్లెల రాజశేఖర్ గౌడ్
జంగా కృష్ణమూర్తి
దర్శన్. ఆర్.ఎన్ (కర్ణాటక)
జస్టిస్ హెచ్‌ఎల్ దత్ (కర్ణాటక)
శాంతారామ్
పి.రామ్మూర్తి (తమిళనాడు)
జానకీ దేవి తమ్మిశెట్టి
బూంగునూరు మహేందర్ రెడ్డి (తెలంగాణ)
అనుగోలు రంగశ్రీ (తెలంగాణ)
బూరగాపు ఆనందసాయి (తెలంగాణ)
సుచిత్ర ఎల్ల (తెలంగాణ)
నరేశ్‌కుమార్ ( కర్ణాటక)
డా.అదిత్ దేశాయ్ (గుజరాత్)
శ్రీసౌరబ్ హెచ్ బోరా (మహారాష్ట్ర)

# అభివృద్ధి పేరుతో కమిషన్ల దందా

- కాంగ్రెస్ పాలనంతా అవినీతిమయం
- జీవోలను పబ్లిక్ డొమైన్ లో పెట్టని సర్కార్
- ఢిల్లీకి మూటల పంపిణీపైనే శ్రద్ధ
- రూ.1150 కోట్ల సివిల్ సప్లయ్ కుంభకోణంపై చర్యలేవి
- డీ ఫాల్టర్ల లిస్టును బయటపెట్టాలి
- పాలకులకు మిల్లర్ల నుంచి భారీ ఎత్తున ముడుపులు
- రాష్ట్ర సర్కార్ అవినీతిపై కేంద్రానికి ఫిర్యాదు చేస్తాం
- బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి



**జనపదం, హైదరాబాద్:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతిమయమైన పరిపాలన సాగిస్తుందని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి విమర్శించారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం మీడియాతో మాట్లాడిన మహేశ్వర్ రెడ్డి కాంగ్రెస్ పాలనపై విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో అవినీతి, వసూళ్లు విచ్చలవిడిగా జరుగుతున్నాయని, అదే సమయంలో అడ్మినిస్ట్రేషన్ మాత్రం సరిగ్గా కొనసాగడం లేదని దుయ్యబట్టారు. తెలంగాణలో అన్ని అంశాలు అవినీతిమయమయ్యాయని ఆరోపించారు. రాష్ట్రంలో పాలన గాడి తప్పిందని, అభివృద్ధి పనుల పేరుతో కాంట్రాక్టులు, కమిషన్ల దందా సాగుతోందని విమర్శించారు. జీవోలను కూడా పబ్లిక్ డొమైన్ లో పెట్టడం లేదన్నారు. కేవలం ఢిల్లీకి వందల కోట్ల చెల్లించేందుకు వసూళ్లు చేయడమే తప్పా ప్రజలకు ఇచ్చిన హామీలపై ధ్యాస లేదన్నారు. 1150 కోట్ల సివిల్ సప్లయ్ కుంభకోణంలో ప్రభుత్వం చర్యలు తీసుకోకపోగా, అక్రమాలకు పాల్పడిన మిల్లర్ల నుంచి రికవరీ చేయకుండా మళ్లీ ధాన్యం అప్పగిస్తున్నారన్నారు. దీని వెనుక చీకటి ఒప్పందం ఏమిటని నిలదీశారు. ఇందులో సీఎంకు, సివిల్ సప్లయ్ మంత్రుల ప్రమేయం ఏమిటని ప్రశ్నించారు.

### మిల్లర్ల నుంచి ముడుపులు..

కాంగ్రెస్ పాలకులు మిల్లర్ల నుంచి భారీ ఎత్తున ముడుపులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ధాన్యం కొనుగోలు వ్యవహారంలో జీవో ఎంఎస్ 27తీసుకొచ్చి అక్రమాలకు పాల్పడిన మిల్లర్లకే బ్యాంకు గ్యారంటీలు ఇవ్వడం వెనుక మతలబు ఏమిటో చెప్పాలని బీజేపీ డిమాండ్ చేస్తోందన్నారు. 20వేల కోట్ల ధాన్యం మిల్లర్ల నుంచి రావాల్సి ఉందని చెప్పిన సివిల్ సప్లయ్ మంత్రి రికవరీ ఎందుకు చేయడం లేదన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వ అవినీతిపై కేంద్రానికి ఫిర్యాదు చేస్తామని, ప్రజా క్షేత్రంలో పోరాడుతామని చెప్పారు. బీఆర్ఎస్ పాలనా విధానాలనే అనుసరిస్తూ వందల కోట్ల దోపిడికి కాంగ్రెస్ పాలకులు పాల్పడుతున్నారన్నారు. మిల్లర్లు, కాంట్రాక్టర్ల డీఫాల్టర్ల లిస్టును బయటపెట్టమంటే ప్రభుత్వం బయటపెట్టడం లేదన్నారు. సన్న బియ్యం నిబంధనల అనులు సాధ్యం కాదని మిల్లర్లు చెప్పినా ప్రభుత్వం ప్రత్యామ్నాయం చూడటం లేదన్నారు.

# రాజ్ పాకాల ప్రత్యక్షం..

- జన్వాడ ఘటన అనంతరం మాయం..
- నేడు న్యాయవాదితో కలిసి పోలీసుల ఎదుట హాజరు
- ఫాం హౌస్ కు తీసుకెళ్లిన మోకిల పోలీసులు
- ఆధారాలు నిల్.. తిరిగి స్టేషన్ లోనే విచారణ
- విజయ్ మద్దూరి స్టేట్‌మెంట్ ఆధారంగా ఎంక్వైరీ
- మొబైల్ ఫోన్ కోసం ఆరా..



**జనపదం, క్రైం :** జన్వాడ ఫాంహౌస్‌లో రేవ్ పార్టీ నిర్వహించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ బావ మరిది రాజ్ పాకాల మూడు రోజుల తర్వాత బుధవారం ఎట్టకేలకు మోకిల పోలీసుల ఎదుట విచారణకు హాజరయ్యారు. అయితే పోలీసులు వారి విచారణలో కల్పితాలు సృష్టించి తనపై కేసులు బనాయించే అవకాశాలు ఉండడంతో తన న్యాయవాదితో కలిసి విచారణకు హాజరయ్యారు. దీంతో కేసులో అత్యంత కీలకమైన రాజ్ పాకాల ఫోన్ వ్యవహారాన్ని ఛేదించడంతో పాటు కీలక ఆధారాల సేకరణ కోసం పోలీసులు రాజ్ పాకాలను ఆయన పాం హౌస్ కు తీసుకెళ్లారు. అయితే అక్కడ సోదాలు నిర్వహించిన పోలీసులకు ఆధారాలేవీ లభించకపోవడంతో ఆయన్ను తిరిగి స్టేషన్ కు తీసుకువచ్చి ప్రశ్నించారు.

### ఫాం హౌస్ ఘటనపై విచారణ..

ఫాం హౌస్ లో జరిగింది దీపావళి విందా..? లేక వేరే పార్టీనా..? ఆ పార్టీలో రాజ్ పాకాల ఉన్నారా..? అందులో ఆయన ఎవరెవరిని పిలిచారు..? ఎవరెవరి కుటుంబ సభ్యులు విందుకు హాజరయ్యారు.? అక్కడ కేవలం మద్యం మాత్రమే సేవించారా..? అనుమతి లేని నాన్ డ్యూటీ పేయిడ్ విదేశీ మద్యం అక్కడ ఎక్కడి నుంచి వచ్చింది...? కొకైన్ తీసుకున్నట్టు తేలిన విజయ్ మద్దూరి విందులోనే డ్రగ్స్ తీసుకున్నారా..? రాజ్ పాకాలే తనకు కొకైన్ ఇచ్చినట్లు విచారణలో తెలిసిన మద్దూరి వ్యాఖ్యల్లో నిజమెంతా..? అనే కోణాలు విచారించినట్లు తెలిసింది. అయితే రాజ్ పాకాల మాత్రం ఫాం హౌస్ లో జరిగింది దీపావళి విందు మాత్రమేనని అందులో కుటుంబ సభ్యులు మాత్రమే పాల్గొన్నారని చెప్పినట్లు సమాచారం. విజయ్ మద్దూరి కొకైన్ ఎక్కడ్నుంచి తీసుకున్నారో తనకు తెలియదన్న రాజ్ పాకాల నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ గురించి తనకు సమాచారం లేదని వివరణ ఇచ్చారు. రాజ్ పాకాల విచారణలో పోలీసులకు కీలక సమాచారం లభించకపోవడంతో విజయ్ మద్దూరి ఇచ్చిన స్టేట్ మెంట్ ఆధారంగా విచారణ జరిపారు. మరోవైపు ఈ కేసులో అత్యంత కీలకంగా మారిన రాజ్ పాకాల మిస్సింగ్ ఫోన్ గురించి ఆరా తీసినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఈ నెల 26న ఫామ్‌హౌస్‌లో విందు జరిగినప్పుడు పోలీసులు తనిఖీలు నిర్వహించిన సమయంలో అక్కడున్న సెల్ఫోన్ ను ఓ మహిళ దాచి పెట్టింది. దాన్ని రాజ్ పాకాల స్నేహితుడు విజయ్ మద్దూరి ఈ నెల 27న పోలీసులకు అప్పగించారు. ఇప్పటికే ఆ మొబైల్ ఫోన్లో ఉన్న డేటా ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కొకైన్ మత్తుపదార్థాలు తీసుకొచ్చి విజయ్ మద్దూరికి ఎవరు ఇచ్చారన్న దాని సైతం పోలీసులు ఆరా తీస్తున్నారు.

### న్యాయవాదితో పాటు..

ఇదిలావుంటే పోలీసులు అక్రమంగా ఈ కేసులో ఇరికించే ప్రయత్నం చేస్తున్నారని, తనను అరెస్ట్ చేయకుండా ఆదేశాలు ఇవ్వాలంటూ రాజ్ పాకాల ఈ నెల 28న కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా దీనిపై ధర్మాసనం ఆ రోజే విచారణ చేపట్టింది. రాజకీయ దురుద్దేశంతోనే కేసు పెట్టారని రాజ్ పాకాల తరఫున మయూర్‌రెడ్డి కోర్టుకు వివరించారు. పోలీసుల తరఫున ఏజీ ఇమ్రాన్ ఖాన్ వాదనలు వినిపించారు. అరెస్టు చేస్తామని తాము చెప్పలేదని, ఈ కేసులో ఇప్పటి వరకు ఎవరిని అరెస్టు చేయలేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఎలాంటి రాజకీయ ప్రమేయం లేదని, నిబంధనల ప్రకారమే 41ఏ నోటీసులు జారీ చేసినట్లు వివరించారు. ఇరువైపు వాదనలు విన్న న్యాయస్థానం పోలీసులు ఎదుట హాజయ్యేందుకు పిటిషనర్‌కు రెండు రోజుల గడువు ఇచ్చింది. బుధవారం గడువు ముగియడంతో రాజ్ పాకాల మోకిల పోలీసుల ముందు విచారణకు హాజరయ్యారు.

## సల్మాన్ ఖాన్‌కు బెదిరింపులు..

### పోలీసులు అదుపులో ఒకరు..



**జనపదం, ఢిల్లీ:** రూ.2కోట్లు ఇవ్వకపోతే చంపేస్తామంటూ బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్ బెదిరింపులు వచ్చిన విషయం తెలిసిందే. ఆ తర్వాత ముంబయి పోలీసులు కేసు నమోదు చేరసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. గుర్తు తెలియని వ్యక్తి నుంచి ముంబయి ట్రాఫిక్ కంట్రోల్ రూమ్‌కు ఓ సందేశం వచ్చింది. రూ.2కోట్లు ఇవ్వకపోతే సల్మాన్ ఖాన్‌ను చంపేస్తామంటూ బెదిరింపులు వచ్చినట్లు పోలీసు వర్గాలు పేర్కొన్నాయి. కేసు నమోదు చేసి విచారణ చేపట్టిన పోలీసులను.. ముంబయి బాంద్రా ప్రాంతంలో ఓ నిందితుడిని అరెస్ట్ చేశారు. ఈ నెల ప్రారంభంలో రూ.5కోట్లు ఇవ్వకపోతే చంపేస్తామంటూ ముంబయి ట్రాఫిక్ పోలీసుల వాట్సాప్ హెల్ప్‌లైన్ డెస్క్‌కు బెదిరింపులు వచ్చాయి. ఆ తర్వాత పోలీసులు జంషెడ్‌పూర్‌కు చెందిన ఓ వ్యక్తిని అరెస్టు చేశారు. ఇటీవల కొద్దికాలం లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ నుంచి సల్మాన్‌కు బెదిరింపులు వస్తున్నాయి. అంతకుముందు గుర్తు తెలియని దుండగులు సల్మాన్ ఇంటి వద్ద కాల్పులు కలకలం సృష్టించాయి. ఆ తర్వాత సల్మాన్ స్నేహితుడు, ఎన్‌సీపీ నేత సిద్ధిఖీని హత్య చేయగా.. అది తమపనేనని లారెన్స్ గ్యాంగ్ ప్రకటించింది. ఆ తర్వాత జీషన్ సిద్ధిఖీకి సైతం బెదిరింపులు రాగా.. యూపీ నోయిడాకు చెందిన వ్యక్తిని ముంబయి పోలీసులు అరెస్ట్ చేశారు. అయితే, సల్మాన్‌కు సంబంధించిన వ్యవహారాలకు దూరంగా ఉండాలంటూ సిద్ధిఖీ కుమారుడితో పాటు పలువురికి గ్యాంగ్ హెచ్చరికలు చేసింది.



## మద్యం ఖర్చులో మనమే ఫస్ట్

- లిక్కర్ కోసం సగటు ఖర్చు 1623
- టాప్‌లో నిలిచిన తెలంగాణ

**జనపదం, బ్యూరో:** మద్యం అమ్మకాల్లో తెలంగాణ దూసుకెళ్తుంది. భారత్ లో సగటున ఓ వ్యక్తి మద్యం కోసం చేసిన ఖర్చులో తెలంగాణ నంబర్ వన్ గా నిలిచింది. 2022-23లో రాష్ట్రంలో యావరేజ్ గా ఓ వ్యక్తి రూ.1623 ఖర్చు చేసినట్లు నివేదికలో వెల్లడైంది. ఇక ఏపీలో సగటున రూ.1306 ఖర్చుతో రెండో స్థానంలో ఉంది. తర్వాత పంజాబ్ లో రూ.1245, ఛత్తీస్గఢ్ లో రూ.1227గా ఉన్నాయి. కింగ్ ఫిషర్, మెక్ వెల్స్, టుబర్గ్ లు పాపులర్ బ్రాండ్స్ నిలిచాయి. కాగా, తెలంగాణలో పండగ, ఫంక్షన్ వస్తే చుక్కాముక్కా ఉండాల్సిందే. తెలంగాణ వ్యాప్తంగా 2,620 మద్యం దుకాణాలుగా.. మరో వేయి వరకూ బార్లు, క్లబ్‌లు, పబ్‌లు ఉన్నాయి. ఇటీవల దసరా పండగ సందర్భంగా భారీగా మద్యం అమ్మడు అయింది. అక్టోబర్ 1 నుంచి అక్టోబర్ 11 వరకూ 11 రోజుల్లో రూ.1057 కోట్ల మద్యాన్ని తాగారు. ఇందులో 10.44 లక్షల కేసుల మద్యం, 17.59 లక్షల కేసుల బీర్లు ఉన్నాయి.

## పిడుగు పడి ఇద్దరు మృతి

### మెదక్ జిల్లాలో విషాదం

**జనపదం ప్రతినిధి, మెదక్ :** పండుగ వేళ మెదక్ జిల్లాలో విషాదం నెలకొంది. గొర్రెలను మేపడానికి వెళ్లగా పిడుగు పడి ఇద్దరు మృతి చెందిన సంఘటన జిల్లాలోని టెక్మాల్ మండలం ధనురా గ్రామ శివారులో బుధవారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. బండారు బేతయ్య (45), డాకూరి భరత్ (15) ఇద్దరు కలిసి గొర్రెలు మేపడానికి వెళ్లారు. ధనురా స్కూల్లో పదవ తరగతి చదువుతున్న భరత్ దీపావళి సెలవులు రావడంతో వాళ్ల నాన్నకు బదులు వెళ్లాడు. బేతయ్య, భరత్ నాన్న ఇద్దరు కలిసి గొర్రెలు మేపుకుంటారు. దీపావళి పండుగ వేళ పిడుగు పడి ఒకే గ్రామంలో ఇద్దరు మృతి చెందడంతో విషాద ఛాయలు అలముకున్నాయి. ఇరు కుటుంబాలు బంధువులు బోరున విలపించాయి.

## కొండగట్టులో మరోసారి మహిళా అఘోరి...

**జనపదం, జగిత్యాల :** జిల్లాపరిధి మల్యాల మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టులో బుధవారం మరోసారి మహిళా అఘోరి ప్రత్యక్షమైంది. నెల రోజుల క్రితం కొండగట్టు వచ్చి భక్తులను ఆశ్చర్యపర్చిన ఆఘోరి ఇటీవలే సికింద్రాబాద్‌లోని ముత్యాలమ్మ గుడిలో పూజలు చేసింది. ఈ మహిళా అఘోరీ తెలంగాణలోని పలు ఆలయాలను సందర్శిస్తూ వస్తోంది. అప్పటినుండి సోషల్ మీడియాలో ఎక్కడ చూసినా ఆమె వీడియోలే కనిపిస్తున్నాయి.

## మీ మద్దతు ఇవ్వండి..

### ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపించండి

### సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనమనేనికి నరేందర్ రెడ్డి వినతి..



**జనపదం, కరీంనగర్:** రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయనున్న తనకు సీపీఐ పార్టీతో పాటు దాని అనుబంధ సంఘాలైన ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, ఏఐటీయూసీ సంఘాల మద్దతు పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్ లో కొత్తగూడెం ఎమ్మెల్యే సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనమనేని సాంబశివరావు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్ రెడ్డి, మర్రి వెంకటస్వామిని కలిసి అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. 34 ఏళ్లుగా రాష్ట్రంలో ఎన్నో విద్యాసంస్థలు నెలకొల్పి వేలాది మంది విద్యార్థులకు నాణ్యమైన విలువలతో కూడిన విద్యను అందించినాని.. శాసన మండలికి పోటీ చేయబోతున్న తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించి రానున్న పట్టభద్రుల ఎన్నికల్లో మద్దతు తెలిపారని వినతి పత్రంలో కోరారు.

# ఎమ్మెల్యే మేడిపల్లికి బెదిరింపు కాల్..

- రూ.20 లక్షలు ఇవ్వాలని డిమాండ్
- విచారణ చేపట్టిన పోలీసులు
- లండన్ నుండి కాల్, గుర్తించిన పోలీసులు, లుక్ అవుట్ నోటీస్ జారీ
- వివరాలు వెల్లడించిన ఏసీపీ వెంకటరమణ



**జనపదం, కరీంనగర్** : చొప్పదండి కాంగ్రెస్ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు బెదిరింపు కాల్స్ రావడం సంచలనంగా మారింది. తనకు గత నెల గుర్తు తెలియని నెంబర్ నుంచి బెదిరింపు కాల్ వచ్చిందని., రూ.20లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారని ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు... విచారణ చేసి లుక్ అవుట్ సర్కులర్ జారీ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ కమిషనరేట్ పరిధిలోని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు గత సెప్టెంబర్ నెలలో 28వ తేదీ మధ్యాహ్నం, రాత్రి సమయాల్లో తెలియని నెంబర్ +447886696497 నుండి వాట్సాప్ ద్వారా ఫోన్ కాల్ వచ్చింది. అక్కడ నుంచి నిందితుడు కాల్ లో మాట్లాడుతూ తనకు రూ.20 లక్షల చెల్లించాలని, లేకంటే తనను రాజకీయంగా అప్రతిష్టపాలు చేసి తన గౌరవానికి భంగం కలిగే చర్యలకు పాల్పడతానని.. తన ఇద్దరు పిల్లలను అనాథలు అయ్యేలా చేస్తానని బెదిరింపులకు గురి చేసినట్లు బాధితుడు కొత్తపల్లి పోలీస్ స్టేషన్ లో ఫిదు చేశారు. ఈ మేరకు వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ కేసు పై విచారణ జరిపిన పోలీసులు నిందితుడు రంగారెడ్డి జిల్లా బోడుప్పల్ లోని భవాని నగర్ కి చెందిన యాస అఖిలేష్ రెడ్డి (33) అని, ఇదు ప్రస్తుతం లండన్ లో ఉన్నాడని, అక్కడినుండి బెదిరింపులకు పాల్పడ్డాడని తేలిందన్నారు. సదరు నిందితుడిపై బ్యూరో ఆఫ్ ఇమ్మిగ్రేషన్ ద్వారా లుక్ అవుట్ సర్కులర్ జారీ చేశామని కరీంనగర్ రూరల్ ఏసీపీ వెంకటరమణ తెలిపారు



# త్రిపుల్ ఆర్ అలైన్మెంట్ మార్చాల్సిందే..

- లేకుంటే ఎన్ని ఉద్యమాలకైనా సిద్ధం..
- ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన

**జనపదం, యాదాద్రి :** త్రిబుల్ ఆర్ అలైన్మెంట్ మార్చే వరకు ఎన్ని ఉద్యమాలకైనా సిద్ధమని త్రిబుల్ ఆర్ రాయగిరి రెవెన్యూ పరిధిలోని రైతులు హెచ్చరించారు. భువనగిరి రాయగిరి త్రిపుల్ ఆర్ రోడ్డు అవార్డు విచారణలో భాగంగా రాయగిరి రెవెన్యూ పరిధిలోని రైతుల పాస్ పుస్తకాలు డాక్యుమెంట్లు సమర్పించాలని అధికారులు కోరగా విచారణను రెవెన్యూ పరిధిలోని రైతులంతా వ్యతిరేకించి ముక్తకంఠంతో నిరసన వ్యక్తం చేశారు. ట్రిపుల్ అలైన్మెంట్ మార్చే వరకు ఎన్నిఉద్యమలు చేయడానికి అయినా వెనుకాడమని రైతులు తెలిపారు. రైతుల ఉద్యమానికి మేం తోడుంటామని చెప్పి రాయగిరి ప్రజలు పెద్ద సంఖ్యలో మద్దతు తెలిపారు. కార్యక్రమంలో మాజీ పీసీసీ డెలికేట్ తంగళ్ళపల్లి రవికుమార్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ చింతల కృష్ణయ్య, మాజీ వార్డ్ మెంబర్ల ఫోరం ప్రెసిడెంట్ పల్లెర్ల యాదగిరి, రైతు నాయకులు ఔశెట్టి పాండు, రాచమల్ల శ్రీనివాస్, ఆంబోతుల కిరణ్, రాయగిరి రైస్ ఇండస్ట్రీ కి సంబంధించిన వర్కర్లు ఓనర్లు ఔషెట్టి రమేష్, దాసరి శ్రీనివాస్, ఈదులకంటి శ్రీనివాస్, ఈదులకంటి శ్రీకాంత్, మల్లబోయిన శ్రీశైలం, ఎల్గిరి ఐలయ్య, కోటాల భద్రయ్య, సామల రవీందర్, మేకల బాల నరసింహ మల్లెబోయిన ఐలయ్య, మేకల వీరయ్య, మల్లెపైన చంద్రపాల్, నర్సిరెడ్డి, మద్దూర్ యాదిరెడ్డి, మద్దూర్ బిక్షం రెడ్డి, సురేష్, ఔశెట్టి పోచమ్మ, ముత్తిరెడ్డిగూడెం రాజు పాల్గొన్నారు.



# రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా అందజేత

**జనపదం, కరీంనగర్**:సౌదీ అరేబియాలో కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం భూపాలపట్నం గ్రామానికి చెందిన పులి అంజయ్య మృతి చెందాడు. మంగళవారం బాధిత కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల గల్ఫ్ ఎక్స్ గ్రేషియా మంజూరి పత్రం (ప్రొసీడింగ్స్) ను మంత్రి పొన్నం ప్రభాకర్, కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఓ కార్యక్రమంలో అందజేశారు. కార్యక్రమంలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ గల్ఫ్ మృతుల కుటుంబాలను ఆదుకోవడానికి రూ.5 లక్షల ఎక్స్ గ్రేషియా (మృతధన సహాయం) ఇవ్వడం దేశ చరిత్ర లోనే ప్రథమం అన్నారు. గల్ఫ్ కార్మికులు, ఎన్నారైలు తమ సమస్యలు విన్నవించుకోవడానికి హైదరాబాద్ ప్రజాభవన్ లో ఏర్పాటు చేసిన 'ప్రవాసీ ప్రజావాణి' కౌంటర్ ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గల్ఫ్ కార్మికుల సమస్యలు అధ్యయనం చేసి ప్రభుత్వానికి సూచనలు చేయడానికి త్వరలో అడ్వయిజరీ కమిటీ ఏర్పాటు చేస్తామని మంత్రి చెప్పారు. కాంగ్రెస్ ఎలక్షన్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం 'గల్ఫ్ గ్యారంటీ' ని అమలు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్ కుమార్ గౌడ్ కు, మంత్రివర్గానికి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకులు అందరికీ కాంగ్రెస్ ఎన్నారై సెల్ కన్వీనర్ మంద భీంరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

# కాంగ్రెస్‌లో కయ్యం..

## భద్రాచలం కాంగ్రెస్‌లో భగ్గుమన్న విబేధాలు

- వీధిన పడ్డ పొదెం, తెల్లం వర్గాల మధ్య ఆధిపత్య పోరు
- దుమ్ముగూడెం మండలంలో తెల్లంకు వ్యతిరేకంగా ఫ్లెక్సీలు
- ఇందిరమ్మ కమిటీల ఏర్పాటుతో బయటపడ్డ అసంతృప్తి
- భద్రాచలం నియోజక వర్గంలో హాట్ టాపిక్




**జనపదం, ఖమ్మం** : భద్రాచలం కాంగ్రెస్ లో ఒక్క సారిగా వర్గ విబేధాలు భగ్గుమన్నాయి. మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్య, స్థానిక ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావుల మధ్య కొంత కాలంగా ఏర్పడ్డ అగాధం కాస్త, వివాదంగా మారి వీధిన పడింది. దుమ్ముగూడెం మండలంలోని ములక పాడు సెంటర్, నర్సాపురం, లక్ష్మీ నగ రంలో ఎమ్మెల్యే తెల్లంకు వ్యతిరేకంగా ఫ్లెక్సీలు వెలిశాయి. ఎమ్మెల్యే తెల్లం వెం కట్రావు సమక్షంలో ఇందిరమ్మ కమిటీ లు వేస్తూ నిజమైన కాంగ్రెస్ కార్యకర్తలకు మొండి చెయ్యి చూపిస్తున్నారంటూ పలు చోట్ల ఫ్లెక్సీలు పెట్టారు. వివిధ పార్టీల నుండి కాంగ్రెస్ లో చేరిన వారికే ఇందరమ్మ కమిటీల్లో స్థానం కల్పిస్తున్నారని ఆరోపించారు. ఇరు వర్గాల మ ధ్య ఇప్పటి వరకూ నివురు గప్పిన ని ప్పుగా వున్న వర్గ పోరు, ఇందిరమ్మ క మిటీల ఏర్పాటు సందర్భంగా భగ్గుమనడం భద్రాచలం నియోజక వర్గం లో ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడిగా కూడా కొనసాగుతున్న పొదెం వీరయ్య, ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్కకు ప్రధాన అనుచరుడు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున పోటీ చేసి, బీఆర్ఎస్ నుంచి పోటీ చేసిన ఇదే తెల్లం వెంకట్రావు చేతిలో ఓడిపోయారు. ఆ తర్వాత, గెలిచిన తెల్లం వెంకట్రావు కూడా కాంగ్రెస్ పార్టీలో చేరారు. తెల్లం రాష్ట్ర రెవెన్యూ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ముఖ్య అనుచరుడు. తె ల్లం అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీఆ ర్ఎస్ నుండి ఒక సారి కాంగ్రెస్ లో చే రారు. ఎన్నికలు ద Zగ్గర పడగానే, కాంగ్రెస్ టిక్కెట్ రాదని గ్రహించి తిరిగి బీఆర్ఎస్ లో చేరి టిక్కెట్ సంపాధించుకున్నారు. కాంగ్రెస్ తరుపున సిట్టింగ్ ఎమ్మెల్యేగా వున్న పొదెం వీరయ్య పోటీ చేశారు. ఉత్కంఠ భరితంగా సాగిన ఈ పోరులో తెల్లం వెంకట్రావు గెలిచి మళ్ల రెండో సారి కాంగ్రెస్ లో చేరారు. ప్రస్తుతం పొంగులేటి అనుచరుడిగా కొనసాగుతున్నారు. మొదటి నుండీ పొదెం, తెల్లం వర్గాల మధ్య పొసగడం లేదు. ని యోజక వర్గంలో రెండు వర్గాల మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతూనే వుంది. నియోజక వర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు జరిగినా ఇద్దరూ కలసి వేదిక ను పంచుకోవడం లేదు. అంతే కాకుం డా, తెల్లం వెంకట్రావుపై ఒక వేళ అన ర్హత వేటు పడితే, ఉప ఎన్నికలో టిక్కెట్ పొదెం వీరయ్యకే ఇవ్వాలని ఆయన అ నుచరులు ఇప్పటికే కోరుతున్నారు. ఇద్దరి మధ్య చినికి చినికి గాలి వానగా మారిన ఈ వర్గ పోరు ఏ మలుపు తిరుగుతుందోనన్న ఆసక్తి సర్వత్రా కనిపిస్తుంది. మరి ఉప ముఖ్యమంత్రి బట్టి, మంత్రి పొంగులేటి వీరుద్దరినీ కూర్చో బెట్టి మాట్లాడతారా ? లేక తమ అనుచరు లనే వెనకేసుకొస్తారా ? అన్నది చూడాలి.

# సీసీఐ కొనుగోళ్లు అంతా తూచ్!

- పత్తికి దక్కని మద్దతు ధర
- తేమ పేరుతో తఖరారు.!
- కొనుగోళ్లకు ముఖం చాటేస్తున్న సీసీఐ
- అందిన కాడికి దండుకుంటున్న ట్రేడర్లు



**జనపదం, మహబూబాబాద్ :** పత్తి రైతుకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని, గరిష్టంగా క్వింటాలుకు రూ.7,521, కనిష్టంగా రూ.7,421 చెల్లిస్తామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటనలతో ఊదరగొడుతుండగా, ఆచరణలో ఎక్కడ కూడా అమలు కావడం లేదు.. దీంతో సీసీఐ పత్తి కొనుగోల్లు అంతా 'తూచ్' గా మారిందని అన్నదాతలు ఆరోపిస్తున్నారు. వర్షాలతో పత్తి పంట దెబ్బతిని ఆశించిన దిగుబడి లభించక ఓవైపు దిగులు చెందుతున్న రైతుకు పండిన కొద్దిపాటి పంటకు మద్దతు దక్కక దిగాలు పడుతున్నాడు. కష్టాల్లో ఉన్న పత్తి రైతుకు మద్దతుగా నిలవాల్సిన కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కొర్రీలతో పత్తి కొనుగోళ్లకు ముఖం చాటేయడంతో పత్తి రైతుకు దిక్కుతోచని స్థితి నెలకొంది. మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా మహబూబాబాద్, తొర్రూరు, కేసముద్రం మార్కెట్ల పరిధిలో ఆరు చోట్ల పత్తి కొనుగోళ్ల కోసం కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా పర్చేజ్ సెంటర్లను ఏర్పాటు చేసింది. ఆయా కేంద్రాల పరిధిలో ఉన్న జిన్నింగ్ మిల్లుల్లో పత్తి కొనుగోల్లు చేపట్టాలని ఆదేశించింది. గత 15 రోజులుగా మహబూబాబాద్ జిల్లా పరిధిలోని వివిధ వ్యవసాయ మార్కెట్లకు వానాకాలంలో పండించిన కొత్త పత్తి విక్రయానికి తెస్తున్నారు. అయితే ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా సీసీఐ ఎక్కడ కూడా పత్తి కొనుగోళ్లకు 'బోణీ' చేయలేదు. నిబంధనల ప్రకారం పత్తిలో 8 నుంచి 12 శాతానికి లోపు తేమ ఉంటేనే తప్ప కొనుగోలు చేయకూడదని సీసీఐ కఠినంగా ఆదేశాలు జారీ చేసినట్లు అధికారులు చెబుతున్నారు. మునుపెన్నడూ లేని విధంగా ఇటీవల పత్తి ఏరే సమయానికి తరచుగా వర్షాలు పడుతుండడంతో ప్రస్తుతం పత్తిలో 25 శాతానికి మించి తేమ ఉంటోంది. తేమ అధికంగా ఉండడం కారణంగా చూపి సీసీఐ అధికారులు పత్తి కొనుగోళ్లకు ముఖం చాటిస్తున్నారు. దీన్ని ఆసరాగా చేసుకున్న ప్రైవేట్ ట్రేడర్లు రైతుల నుంచి పత్తిని తక్కువ ధరకు కొనుగోలు చేస్తూ ఎడాపెడా దోపిడి చేస్తున్నారు. ఫలితంగా జిల్లా వ్యాప్తంగా పత్తి సాగు చేసిన రైతులు క్వింటాలుకు వెయ్యి నుంచి రూ.2000 వరకు నష్టపోవలసిన పరిస్థితి ఏర్పడింది. పత్తి పంట తీయడం ఆరంభించి పక్షం రోజులు కావస్తున్నప్పటికీ, ప్రభుత్వం నిర్దేశించిన గరిష్ట ధర ఏ ఒక్క రైతుకు కూడా లభించడం లేదు. నాణ్యతలేమి, తేమ కారణం చూపి ఇష్టారాజ్యంగా ధర పెడుతున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కష్టకాలంలో రైతుకు అండగా నిలవాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సీసీఐ కొనుగోళ్లలో సడలింపులు ఇస్తే తప్ప రైతులకు 'మద్దతు' ధర దక్కే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పత్తిలో తేమ శాతాన్ని 8 నుంచి 18 శాతానికి పెంచడంతోపాటు నిబంధనల్లో సడలింపులు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. ప్రభుత్వాలు ఉదారత చూపకపోతే ఈ ఏడాది పత్తి రైతుకు 'దూది పువ్వు' పంట దుఃఖంగా మారే పరిస్థితి ఏర్పడిందని చెబుతున్నారు. కాగా, తేమ 12 శాతానికి తగ్గితే పత్తి కొనుగోలు చేస్తామని, ప్రస్తుతం 20 నుండి 25 శాతం తేమ ఉంటుండడంతో పత్తి కొనుగోలు చేపట్టలేక పోతున్నట్లు సీసీఐ పర్చేజ్ ఇంచార్జ్ సింహాద్రి నాయుడు తెలిపారు. కేసముద్రం మార్కెట్ పరిధిలో విక్రయానికి వస్తున్న పత్తిని ప్రతిరోజు పరిశీలిస్తున్నామని, తేమ అధికంగా ఉండడం కారణంగా ఇప్పటివరకు పత్తిని కొనుగోలు చేయలేక పోయినట్లు ఆయన తెలిపారు.

# మయోనైస్‌పై నిషేధం..

- వైద్య ఆరోగ్య శాఖ కీలక నిర్ణయం
- 2025 అక్టోబర్ వరకు అమలు



**జనపదం, బ్యూరో :** ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్న మయోనైజ్‌ను నిషేధించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు బుధవారం సాయంత్రం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉడకబెట్టని కోడి గుడ్లతో తయారు చేస్తున్న మయోనైజ్‌ను ఏడాది పాటు నిషేధిస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ఆఫీసులో ఫుడ్ సేఫ్టీపై వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లతో నియమించిన టాస్క్‌ఫోర్స్ కమిటీల పనితీరుపై మంత్రి దామోదర్ రాజ నర్సింహ ఆరా తీశారు. 235 హోటళ్లు, హాస్టళ్లు, స్ట్రీట్ ఫుడ్ స్టాల్స్, గోడౌన్స్‌లో తనిఖీలు నిర్వహించామని, 170 సంస్థలకు నోటీసులు ఇచ్చామని జీహెచ్ఎంసీ టా స్క్‌ఫోర్స్ అధికారులు మంత్రి కి తెలియజేశారు. అన్ని జిల్లాల్లోనూ నిరంతరం తనిఖీలు నిర్వహించాలని మంత్రి ఫుడ్ సేఫ్టీ అధికారులను ఆదేశించారు. ఇందుకోసం రెండు టాస్క్‌ఫోర్స్ కమిటీలను నియమించారు. హైదరాబాద్ లోని నందినగర్‌లో మోమోస్ తిని పలువురు అస్వస్థతకు గురైన ఘటనపై మంత్రి ఆరా తీశారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే వి ధంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు మంత్రి దిశానిర్దేశం చేశారు. వివిధ రకాల ఆహార పదార్థాలతో కలిపి తినే మయో నైజ్‌ను కల్తీ ఎగ్స్‌తో, ఉడకబెట్టని ఎగ్స్‌తో తయారు చేస్తున్నారని, దానివల్ల ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోందని అధికారులు మంత్రి దామోదర్ రాజనర్సింహ కు వివరించారు. మయోనైజ్ క్వాలిటీ తిన్న తర్వాత కలిగిన దుష్పరిణామాలపై పదుల సంఖ్యలో ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. కేరళలో ఈ తరహా మయోనైజ్ తయారీని అక్కడి ప్రభుత్వం నిషేధించిందని, ప్రజల ఆరోగ్యం దృష్ట్యా మన రాష్ట్రంలో నిషేధం విధించాలని అధికారులు మంత్రి దామోదర్ రాజనర్సింహ కు నివేదించారు. అధికారుల నివేదిక ప్రకారంగా పలువురు డాక్టర్లు, ఫుడ్ సేఫ్టీ ఉన్నతాధికారులతో చర్చించిన మంత్రి, మయోనైజ్‌పై రాష్ట్రం లో నిషేధం విధించేందుకు ఆదేశాలు జారీ చేయాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ శాఖ కమిషనర్ ఆర్ వీ కర్ణన్ ను ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు బుధవారం సాయం త్రం కర్ణన్ ఉత్తర్వులు జారీ చేశారు. 2025 అక్టోబర్ చివరి వరకూ ఈ ఉత్తర్వులు అమల్లో ఉంటాయని పేర్కొన్నారు.రాష్ట్రంలో గత పదేండ్లలో హోటళ్లు, స్ట్రీట్ ఫుడ్ స్టాల్స్, హాస్టళ్ల సంఖ్య భారీగా పెరిగిందని, ఇం దుకు అనుగుణంగా ఫుడ్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్ బలోపేతం కాలేదని, కొత్త పోస్టులు మంజూరు కాలేదని అధికారులు మంత్రికి వివరించారు. ప్రజల ఆరోగ్యం, ప్రాణాలతో ముడిపడి ఉన్న డ్రగ్ సేఫ్టీ, ఫుడ్ సేఫ్టీ విషయంలో రాజీ పడేది లేదని ఈ సందర్భంగా మంత్రి వ్యాఖ్యానించారు. ఫుడ్ సేఫ్టీలో ముందున్న రాష్ట్రాలు, దేశాల్లో అవలంభిస్తున్న పద్ధతులపై అధ్యయనం చేసి, నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లు, ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్స్ సంఖ్యను పెంచేందుకు ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు. అవసరమైన కొత్త పోస్టులను మంజూరు చేసి, భర్తీ చేస్తామన్నారు. కొత్తగా మూడు ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్స్‌ను ఏర్పాటు చేయబోతున్నామని మంత్రి తెలిపారు. 5 మొబైల్ ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్స్ అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. సంవత్సరానికి సుమారు 24 వేల సాంపిల్స్ టెస్ట్ చేసేలా ల్యాబులను బలోపేతం చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఫుడ్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్ మొత్తాన్ని ఒకే గొడుగు కిందకు తీసుకురావాలని మంత్రి ఆదేశించారు. ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్లలో డ్రగ్ అథారిటీ, ఫుడ్ సేఫ్టీ అధికారుల ఆఫీసులు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు తీసుకునేందుకు గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేయాలన్నారు. ఫుడ్, డ్రగ్స్‌కు సంబంధించిన ఫిర్యాదులు ఎవరికి, ఎక్కడ చేయాలో ప్రజలకు తెలిసేలా అవగాహన కల్పించాలన్నారు. ఆహారం కల్తీ చేయాలంటే భయపడేలా ఆహార కల్తీచేసే వారిపై చర్యలు ఉండాలని అధికారులను మంత్రి ఆదేశించారు. సమావేశంలో ఫుడ్ సేఫ్టీ కమిషనర్ కర్ణన్, డైరెక్టర్ శివలీల, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్లు మూర్తి రాజు, అమృత, ధర్మేంద్ర తదితరులు పాల్గొన్నారు.



# నందనవనం ఆక్రమణలను తొలగించండి

- అర్హులకు న్యాయం చేయండి
- అధికారులకు మంత్రి పొంగులేటి ఆదేశాలు

**జనపదం, సెక్రటేరియట్** : రంగారెడ్డి జిల్లా ఎల్ బీ నగర్ నియోజకవర్గ పరిధిలోని నందనవనంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన ఇండ్లను అక్రమంగా ఆక్రమించుకున్నవారిని తక్షణం ఖాళీ చేయించి అర్హులైన వారికి అందించాలని రెవెన్యూ. హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం సచివాలయంలో మహేశ్వరం నియోజకవర్గంలోని మంకాల్, నందనవనంలో ఉన్న ఇండ్ల సమస్య, కేటాయింపుపై అధికారులతో సమావేశమయ్యారు. సమావేశంలో హౌసింగ్ సెక్రటరీ జ్యోతి బుద్ధప్రకాష్, ప్రజావాణి నోడల్ ఆఫీసర్ డి.దివ్య, ప్రస్తుత రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి, గతంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్లుగా పనిచేసిన డాక్టర్ ఎస్. హరీష్, కె.శశాంక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అక్రమంగా ప్రభుత్వ ఇండ్లను ఆక్రమించుకున్నవారి పట్ల కఠినంగా వ్యవహరించాలని, ఎలాంటి రాజకీయ వత్తిడులకు తలొంగ వద్దని అధికారులకు సూచించారు. నందనవనంలో జె ఎన్ యూ ఆర్ ఎం పథకం కింద ప్రభుత్వం నిర్మించిన ఇండ్ల కోసం 2019లో దరఖాస్తు చేసుకొని, లబ్ధిదారుని వాటా చెల్లించిన వారి ఇండ్లను కొంతమంది అక్రమంగా ఆక్రమించుకోవడం పట్ల ఆయన తీవ్రంగా స్పందించారు. బాధితులకు న్యాయం చేయాలని, ఆక్రమించుకున్న వారి నుంచి ఇండ్లు స్వాధీనం చేసుకొని వారికి కేటాయించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే మంకాల్‌లో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇండ్ల కేటాయింపులో ఉన్న న్యాయపరమైన సమస్యలను తక్షణం పరిష్కరించి, అర్హులైన వారికి కేటాయించాలని అధికారులకు సూచించారు. ఈ రెండు అంశాలపై పూ ర్తిస్థాయి నివేదికను తనకు అందిం చాలని, వీలైనంత త్వరితగతిన ఈ సమస్యలను పరిష్కరించా లని అధికారులను ఆదేశించారు. నిరుపేదలకు అ న్యాయం జరిగితే ఈ ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని అన్నారు. ప్రజావాణిలో గృహనిర్మాణానికి సం బంధించి వచ్చే ఫిర్యాదులను సచివా లయంలోని తన కార్యాలయానికి పంపించాలని నోడల్ అధికారికి దివ్యకు సూచించారు.వాటి పరిష్కారానికి తన కార్యాలయంలో ప్రత్యేక అధికారికి బాధ్యతలు అప్పగిస్తాని పేర్కొన్నా



# ఆర్బీఐలో భారీగా పెరిగిన పసిడి నిల్వలు

**జనపదం, ముంబై** : రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇం డియా భారీ మొత్తంలో బంగారాన్ని స్వదేశా నికి తీసుకువచ్చింది. బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ వాల్ట్‌ల నుంచి దాదాపు 102 టన్నుల బం గారాన్ని తీసుకువచ్చింది. దీంతో ఆర్బీఐలో బంగారం నిల్వలు పెరిగాయి. 2024 సెప్టెంబర్ చివరి నాటికి ఆర్బీఐ మొత్తం నిల్వలలో 855 టన్నుల పసిడి నిల్వలు ఉన్నాయి. 2024 మార్చి 31న ఇవి 408 మెట్రిక్ టన్నులుగా ఉన్నాయి. విదేశాల్లో ఉంచిన నిల్వలతో కలిపి 854.73 టన్నులుగా ఉన్నట్లు ఆర్బీఐ తెలిపింది. గత కొంత కాలంగా ఆర్బీఐలోని గోల్డ్ నిల్వలను దేశంలోని స్థానిక వాల్ట్‌లకు తరలిస్తున్నారు. 1991 తర్వాత మొదటిసారిగా యూకే నుంచి భారతదేశంలోని దాని వా ల్ట్‌లకు 100 టన్నులకు పైగా బంగారాన్ని తరలించింది. ఇంకా 324.01 మెట్రిక్ టన్నుల గోల్డ్‌ను బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ సేఫ్ కస్టడీలో ఉంచింది. అయితే గతేడాది మాదిరిగానే ఈసారి కూడా ఆర్‌బీఐ బంగారాన్ని తరలించడానికి ప్రత్యేక విమానంలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లతో రహస్య మిషన్ చే పట్టింది. సమాచారం బయటకు రాకుండా అన్ని జాగ్రత్త చర్యలు తీసుకుంటుంది.

సెప్టెంబరు 2022 నుంచి భారత్ 214 టన్నుల గోల్డ్‌ను స్వదేశానికి తీసుకువచ్చింది. స్వదేశానికి తరలించడంలో ఆర్బీఐ కేంద్ర ప్రభుత్వం కీలకంగా వ్యవహరించాయి. మరోవైపు.. ప్రస్తుత అనిశ్చిత ప్రపం చ పరిస్థితుల మధ్య దేశీయంగా ఇంత పెద్ద మొత్తంలో బంగారం నిల్వలను కలిగి ఉండటం భద్రత దృష్ట్యా ప్రభుత్వం కొంత ఆందోళన వ్యక్తం చేస్తుంది. 1990ల తర్వాత ఇంతపెద్ద మొత్తంలో బంగారం స్వదేశానికి చేరుకుంది. అప్పట్లో, చెల్లింపుల సంతులనం సంక్షోభం సమయంలో ప్రభుత్వం విదేశీ బ్యాంకులకు బంగారాన్ని తాకట్టు పెట్టింది. అయితే ప్రామాణిక సమీక్షల నేపథ్యంలో విదేశాల్లో పసిడి నిల్వలు తగ్గించుకోవాలనే యోచనలో ఆర్‌బీఐ ఉన్నట్లు తెలుస్తోంది. ప్రాచ్య దేశాల్లో ఆర్థిక అనిశ్చితి, సంఘర్షణల మధ్య పెట్టుబడిదారులు బంగారం వైపు మొగ్గుచూపుతున్నందున వచ్చే ఏడాదిలో 10



# డ్రగ్స్ కేసులో ఇరికించాలని చూశారు..

- కుట్ర పన్నిన సీఎం రేవంత్
- ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ సవాల్ ను స్వీకరిస్తున్నా..
- బీఆర్ ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి

**జనపదం, హైదరాబాద్ :** డ్రగ్స్ కేసులో తనను ఇరికించాలని సీఎం రేవంత్ చూశారని ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలతో రేవంత్ డ్రగ్స్ టెస్ట్‌కు రావాలని ఆయన సవాల్ చేశారు. కావాలనే రాజ్ పాకాలను డ్రగ్స్ కేసులో ఇరికించాలని చూస్తున్నారన్నారు. బీఆర్ఎస్ నేతలందరూ డ్రగ్స్ టెస్ట్ చేసుకోవాలని రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ వేసిన సవాల్ ను తాము స్వీకరిస్తున్నామని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు రెడీగా ఉన్నారని తాను చెప్పినట్లు చెప్పారు. కానీ.. అనిల్ కుమార్ యాదవ్ ఎవరికి చెప్పకుండా హాస్పిటల్ కు వెళ్లారని అన్నారు. నేను కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు టెస్ట్ కు రావాలని చెప్పినట్లు గుర్తు చేశారు. అనిల్ కుమార్ యాదవ్ తనకు మంచి మిత్రుడని, అయితే నా పంచాయితీ ఆయనతో కాదని, రేవంత్ రెడ్డితో అని స్పష్టం చేశారు. నన్ను ట్రాప్ చేయలేదని ఇంటిలిజెన్స్ చీఫ్ ను ప్రెస్ మీట్ పెట్టి చెప్పామను అని కౌశిక్ నిలదీశారు. తన పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు, ఎంపీలతో డ్రగ్స్ టెస్ట్ కు రావాలని రేవంత్ రెడ్డికి సవాల్ విసురుతున్నానని కౌశిక్ రెడ్డి అన్నారు. మేము డబ్బా పట్టుకుని రెడీగా ఉన్నామని, తమ ఎమ్మెల్యేలు అంతా వెయిట్ చేస్తున్నారని, ఇప్పటి వరకు మమ్మల్ని పిలవలేదని ఎద్దేవా చేశారు. ఆరు గ్యారెంటీలను అమలు చేయలేక డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి డ్రగ్స్ గురించి మాట్లాడితే చిత్తశుద్ధితో మాట్లాడాలని అన్నారు. నన్ను ట్రాప్ చేసినట్లు.. రాజ్ పాకాల కుటుంబాన్ని ఇరికించాలని చూశారని ఆరోపించారు.

# అయోధ్యలో 25లక్షల దీపాలు

- బాలరాముడు సన్నిధిలో అంబరాన్నంటిన వేడుకలు
- వెలుగులో మెరిసిన దేవదేవవుడు
- గిన్నిస్ రికార్డులో చోటు..
- ఏకకాలంలో 1,121 మంది హారతి

జనపదం,బ్యూరో: బాలరాముడు కొలువు దీరిన అయోధ్యలో దీపావళి వేడుకలు అంబరాన్నంటాయి. గత ఎనిమిదేళ్లుగా సరయూ నదీ తీరం లో దీపోత్సవం నిర్వహిస్తున్న ఉత్తర్‌ప్రదేశ్ ప్రభు త్వం, ఈసారి కూడా అత్యంత వైభవంగా వేడుకలు జరిపింది. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనా థ్ స్వయంగా దీపాలు వెలిగించి దీపోత్సవాన్ని ప్రారంభించారు. భక్తులు 25 లక్షలకుపైగా దీపాలు వెలిగించారు. దీనితో అయోధ్యా నగ రం ధగధగా మెరిసిపోయింది. 55 ఘాట్‌లలో ఏర్పాటు చేసిన ఈ ప్రమిదలను ప్రత్యేక డ్రోన్లతో గిన్నిస్ ప్రతినిధులు లెక్కించారు.

## గిన్నిస్ రికార్డ్

అయోధ్య దిపోత్సవంలో భాగంగా, యూపీ టూరిజం డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో భక్తులు ఏకకాలంలో 25,12,585 దీపాలను వెలిగించారు. ఇది ఇంతకు ముందు ఉన్న అన్ని గిన్నిస్ రికార్డ్‌లను బ్రేక్ చేసింది. అదే విధంగా యూపీ టూరిజం డిపార్ట్‌మెంట్, సరయు హారతి సమి తి ఆధ్వర్యంలో ఏకకాలంలో 1,121 మంది దే వునికి హారతి ఇస్తూ ప్రపంచ రికార్డ్ సృష్టిం చా రు. ఈ విధంగా ఆయోధ్య దీపోత్సవం ఏక కా లంలో రెండు గిన్నిస్ రికార్డులను సృష్టించింది.

## అలరించిన లేజర్ షో

అయోధ్య ఆలయ ప్రాణ ప్రతిష్ఠ తర్వాత తొలి దీపావళి కావడం వల్ల దీపోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించారు. అయోధ్య దీపోత్సవానికి ముందు రాముడు, సీత, లక్ష్మణుడు, హనుమంతుడి వేషధారులు కొలువుదీరిన రథాన్ని లాగా రు. వేడుకల సందర్భంగా సుమారు 10వేల మంది



భద్రతా సిబ్బంది అయోధ్య రక్షణ బాధ్యతలు నిర్వహించారు. వేడుకల సందర్భంగా ప్రదర్శించిన లేజర్, డ్రోన్ షోలు, రామాయణ ఘట్టాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. లేజర్ షో ద్వారా రామాయ ణ ఘట్టాలను ప్రదర్శించారు. మయన్మార్, నేపాల్, థాయ్‌లాండ్, మలేషియా, కంబోడి యా, ఇండోనేసియా, భారతీయ కళా ప్రదర్శనలు సైతం ఆకట్టుకున్నాయి.

# మహారాష్ట్ర బరిలో 150 మంది రెబల్స్

### మహాయుతి, ఎంవీఏ కూటములకు తిరుగుబాటుదారుల బెడద

జనపదం, ముంబై: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు నామినేషన్ల గడువు మంగళవారంతో ముగియగా, రెండు ప్రధాన రాజకీయ కూటముల నుంచి 150 మందికిపైగా రెబల్స్ బరిలోకి దిగారు. బీజేపీ నేతృత్వంలోని మహాయుతి, కాంగ్రెస్ నాయకత్వంలోని ఎంవీఏ కూటముల పక్షాన అధికార అభ్యర్థులకు వ్యతిరేకంగా రెబల్స్ నామినేషన్లు వేశారు. మహాయుతి పక్షాన అత్యధికంగా 80 మంది రెబల్స్ బరిలోకి దిగారు. నామినేషన్ల ఉపసంహరణకు నవంబర్ 4 వరకు గడువు ఉండటంతో రెబల్స్‌ను బుజ్జగిం



చేందుకు ఆయా పార్టీలకు వారం రోజుల గడువు లభించింది. అసెంబ్లీలోని మొత్తం 288 స్థానాలకు అభ్యర్థులను పోటీకి దింపామని రెండు కూటములూ ప్రకటించాయి.



# టీచర్ల సాయం కావాలె..

**కుల గణన సర్వేలో ఉపాధ్యాయులను భాగస్వామ్యం చేస్తున్నాం**
**సర్వే కోసం సంఘాల సూచనలు ఆచరణలో పెడతాం**
**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం..**



**జనపదం, హైదరాబాద్ సిటీ:** చారిత్రాత్మక కుల గణన సర్వేలో ఉపాధ్యాయులను భాగస్వాములను చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావించిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. బుధవారం ఆయన మంత్రులు దుదిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ తో కలిసి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఉపాధ్యాయ సంఘాలతో సమావేశమై వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. సర్వే ప్రాధాన్యత, రాష్ట్ర ప్రభుత్వం ఆలోచనను డిప్యూటీ సీఎం వివరించారు. ప్రతిష్టాత్మక కార్యక్రమంలో ఉపాధ్యాయులను భాగస్వాములను చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, క్యాబినెట్ నిర్ణయించి మీ ఆలోచనలను తెలుసుకోవాలని కోరారన్నారు. ఆ మేరకు ఉపాధ్యాయ సంఘాలను డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయానికి ఆహ్వానించినట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. సామాజిక స్పృహ కలిగిన, గురుతర బాధ్యత ఎరిగిన వారు ఉపాధ్యాయులని తెలిపారు. ఉపాధ్యాయ సంఘాల నేతలు కోరినట్టు ఉదయం వేళల్లో సర్వే నిర్వహించడం, సెప్టెంబర్ 9 నుంచి 15 వరకు వరుస సెలవుల మధ్య సర్వే చేపట్టడం, సెలవు రోజుల్లో సర్వే విధుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులకు పరిహారంతో కూడిన సెలవులు మంజూరు చేయడం, సర్వేకు సంబంధించి సమాజంలో విస్తృత ప్రచారం చేయాలని ఇచ్చిన సూచనలు అన్నింటిని ఆచరణలో పెడతామని డిప్యూటీ సీఎం తెలిపారు. సర్వే విధుల్లోకి వెళ్లే ఉపాధ్యాయ, ఉద్యోగ లోకానికి సమాజం పెద్ద ఎత్తున స్వాగతం పలుకుతుందని తెలిపారు. అద్భుతమైన సమాజాన్ని తెలంగాణలో నిర్మించేందుకు ఉపాధ్యాయులు రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి నడవాలని కోరారు. సోషియో, ఎకనామిక్ ఎడ్యుకేషన్, పొలిటికల్ ఎంప్లాయిమెంట్ రంగాల్లో ఎవరెవరు ఎక్కడెక్కడ ఏ స్థాయిలో ఉన్నారో తెలుసుకునేందుకు సర్వే ఉపయోగపడుతుందని డిప్యూటీ సీఎం తెలిపారు.

**గతం వదిలేయండి..**

గతంలో మేము చేపట్టిన సకల జనుల సర్వే ఎటుపోయిందో ఎవరికి తెలియదని, ప్రస్తుత ప్రభుత్వం కోరుకున్న విధంగా సర్వే చేయడానికి ఉపాధ్యాయ లోకం సంపూర్ణంగా సిద్ధంగా ఉందని ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సౌకతలి తెలిపారు. ఉపాధ్యాయులు అయితేనే సర్వే బాగా చేస్తారని నమ్మకం మాపై ఉంచినందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలని పీఆర్ టీయు రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్ రెడ్డి తెలిపారు. సర్వేలో పాల్గొనే ఉపాధ్యాయులకు సీసీఎల్ పరిహారంతో కూడిన సెలవును మంజూరు చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య కోరారు. సర్వేలో పాల్గొని ఉపాధ్యాయులకు స్పెషల్ సీఎల్ తో పాటు, ఇన్సెంటివ్ ఇవ్వాలని డీటీఎఫ్ అధ్యక్షుడు లింగారెడ్డి కోరారు. ఆదివాసీ ఉపాధ్యాయ సంఘం ఏర్పడి 12 ఏళ్లు కాగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచే సమావేశాలకు ఆహ్వానించి గౌరవిస్తున్నందుకు ధన్యవాదాలు అని ఆదివాసి టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రవి తెలిపారు. ఎన్నికలు, జనగణన వంటి కీలక కార్యక్రమాలు ఉపాధ్యాయులు లేకుండా పూర్తి కావని, కుల గణన సర్వేలోనూ సంపూర్ణంగా సహకరిస్తామని యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి తెలిపారు. గత ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేసేవి కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి సందర్భంలోనూ మమ్ములను పిలిపించి మాట్లాడుకుని మా అభిప్రాయాలు తెలుసుకుంటుందని మోడల్ స్కూల్స్ రాష్ట్ర అధ్యక్షుడు కొండయ్య అభినందించారు. ఎవరి జనాభా ఎంత ఉందో, ఎక్కడ ఉన్నారో సరిగా లెక్కలు లేవు కాంగ్రెస్ ప్రభుత్వం కులగణనతో సామాజిక, ఆర్థిక, రాజకీయ వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నం చేయడం సంతోషకరమైన విషయమని ఎస్సీ, ఎస్టీ ప్రజా సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు జాజుల వెంకటేశ్వరరావు తెలిపారు. సమావేశంలో మొత్తం 13 ఉపాధ్యాయ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు సమావేశంలో పాల్గొని వారి అభిప్రాయాలు తెలిపారు.





# అదేం లెక్కా..?

- ఏదైనా ఉంటే డెడికేషన్ గా చేయాలి..
- బీసీ రిజర్వేషన్ల అమలుపై డెడికేటెడ్ కమిషన్..?
- రాష్ట్ర సర్కార్ కు హైకోర్టు ఆదేశం
- స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లపై కీలక హుకుం
- రిజర్వేషన్లపై అధ్యయనాన్ని బీసీ కమిషన్‌కు అప్పజెప్పడం సరికాదని వ్యాఖ్య

**జనపదం, హైదరాబాద్ బ్యూరో:** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల అమలుపై ప్రత్యేక డెడికేటెడ్ కమిషన్‌ను నియమించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీ వర్గాలకు కల్పించాల్సిన రిజర్వేషన్ల శాతం నిర్ణయించడానికి వీలుగా సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం డాక్టర్ కె.కృష్ణమూర్తి కేసులో త్రిసభ్య ధర్మాసనం వికాస్ కిషన్‌రావు గవాలి కేసులో వెలువరించిన ఆదేశాలను పాటించి రాష్ట్రంలో కూడా ప్రత్యేక డెడికేటెడ్ కమిషన్‌ను నియమించాలని కీలక సూచనలు జారీ చేసింది. బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం, తీరును సవాల్ చేసిన బీసీ జాతీయ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. వచ్చే నెల 6వ తేదీ నుంచి రాష్ట్రంలో సమగ్ర సర్వేతో పాటు కులగణన ప్రారంభమవుతున్న నేపథ్యంలో దీనిపై కోర్టు బుధవారం విచారణ చేపట్టింది. ఇందులో ఇరు వర్గాల వాదనలు విన్న జస్టిస్ ఎస్.నంద ఏకసభ్య ధర్మాసనం ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఇందుకు సంబంధించి జస్టిస్ ఎస్.నంద ఏకసభ్య ధర్మాసనం ముందు సీనియర్ అడ్వకేట్, మాజీ అడ్వకేట్ జనరల్ బి.ఎస్.ప్రసాద్ పిటిషనర్ పక్షాన వాదనలను వినిపించారు. అనంతరం జస్టిస్ ఎస్.నంద, ఏకసభ్య ధర్మాసనం పిటిషనర్ ఆర్.కృష్ణయ్య ప్రజాప్రయోజన వ్యాజ్యంలో లేవనెత్తిన అంశాలను సమర్థించింది.

**బీసీ కమిషన్ కు అప్పగించడం సరికాదు..**

రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్‌ల శాతంను నిర్ణయించేందుకు ఇటీవల రాష్ట్ర బీసీ కమిషన్‌కు ప్రత్యేక బాధ్యతలను అప్పగించింది. దీనిపై బీసీలకు రాజకీయ రిజర్వేషన్‌లలో ఎలాంటి ఆటంకాలు ఏర్పడకుండా ఉండేందుకు వీలుగా హైకోర్టులో సవాల్ చేస్తూ రిట్ పిటిషన్ వేశారు. అయితే రిజర్వేషన్ల అధ్యయనం బీసీ కమిషన్ కు అప్పగించడాన్ని సవాల్ చేస్తు బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య హైకోర్టులో వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. ఈ కేసుకు సంబంధించి బుధవారం విచారణ చేపట్టిన ఏకసభ్య ధర్మాసనం ప్రభుత్వం, పిటిషనర్ అభ్యంతరాలు పరిశీలించి వారి వాదనలు విన్నది. ఈ నేపథ్యంలో రిజర్వేషన్లపై అధ్యాయాన్ని బీసీ కమిషన్‌కు అప్పజెప్పడం సరికాదని అభిప్రాయపడ్డ హైకోర్టు ఇది సుప్రీంకోర్టు తీర్పుకు విరుద్ధమని, వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించింది. హైకోర్టు ఏకసభ్య ధర్మాసనం రాష్ట్రప్రభుత్వాను 'డెడికేటెడ్ కమిషన్'ను నియమించాలని ఆదేశించడంపై జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య హర్షం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా హైకోర్టు తీర్పును గౌరవించి వెంటనే నిపుణులతో కూడిన 'డెడికేటెడ్ కమిషన్'ను నియమించాలని ఆయన కోరారు.



# దీపావళి ధమాకా..

**(మొదటిపేజీ తరువాయి)** ఉద్యోగులకు డీఏ బకాయిలు 2025 జనవరి నుంచి 17 సమాన వాయిదాల్లో చెల్లింపులు చేయనున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. కాగా, గత కొన్ని రోజులుగా తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగులు.. పెండింగ్‌లో ఉన్న డీఏ తోపాటు మెడికల్ బిల్లులు, ఈహెచ్‌ఎస్ స్కీమ్, లోక్‌సభ ఎన్నికల సమయంలో బదిలీ అయిన ఉద్యోగులను తిరిగి పాత స్థానాల్లో పంపించడం, సీపీఎస్ రద్దు తదితర మొత్తం 50 సమస్యలపై ఆందోళన చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఉద్యోగులతో చర్చలు జరిపింది.ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నామన్న ప్రభుత్వం.. ఈ నెల 26న జరిగిన కేబినెట్ భేటీలో ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న రెండు డీఏల విడుదలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ నేపథ్యంలోనే డీఏ పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఉద్యోగుల్లో హర్షం వ్యక్తమవుతున్నది.

# మోదీపై యుద్ధం..



(మొదటిపేజీ తరువాయి) శ్రేణులకు పిలుపునిచ్చారు. బుధవారం గాంధీభవన్ లో కులగణనపై జరిగిన అవగాహన సమావేశంలో పాల్గొన్న సీఎం తెలంగాణలో జరగనున్న కులగణన ఎక్స్ రే మాత్రమే కాదనీ అది మెగా హెల్త్ చెకప్ లాంటిదన్నారు. తెలంగాణ నుంచే నరేంద్రమోదీపై యుద్ధం ప్రకటించాలని సూచించారు. పార్టీకి నష్టం చేకూర్చేలా ఎవరైనా ఇష్టానుసారంగా మాట్లాడితే పార్టీ సహించదని సీఎం పార్టీ శ్రేణులను హెచ్చరించారు. రేవంత్ రెడ్డి చట్టాన్ని అమలు చేస్తాడు తప్ప వ్యక్తిగత ఎజెండాతో పనిచేయడనే విషయాన్ని అందరూ గమనించాలనీ, దాన్ని దృష్టిలో పెట్టుకుని పని చేయాలన్నారు. అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులపై ప్రతిపక్షాల విమర్శలు, చేస్తున్న కుట్రలను ప్రతీ ఒక్కరు తిప్పికొట్టాలని పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఆదాయాన్ని సామాజిక న్యాయం ప్రకారం పంచడమే కాంగ్రెస్ విధానమని చెప్పారు. ప్రతిపక్షాలు ఎన్ని అడ్డంకులు సృష్టించినా డీఎస్సీ పూర్తి చేసి ఉద్యోగ నియామక పత్రాలు అందించామని సీఎం వివరించారు.

ఉద్యోగాలపై ప్రతిపక్షాల కుట్రలను ఎదుర్కోవాలి.. రాజకీయ మనుగడ కోసం అడ్డంకులు సృష్టించినా కేవలం పది నెలల్లో 50వేల ఉద్యోగ నియామక పత్రాలు అందించామన్నారు. గ్రూప్ 1 విషయంలోనూ ప్రతిపక్షాలు రకరకాల అపోహలు సృష్టించి అడ్డుకోవాలని చూశాయని ఆరోపించిన సీఎం జీవో , నోటిఫికేషన్ ఇచ్చినప్పుడు, ప్రిలిమ్స్ ఫలితాలు ఇచ్చినపుడు కోర్టుకు పోలేదన్నారు. కానీ మెయిన్స్ నిర్వహించే సందర్భంలో జీవో 29పై కోర్టుకు వెళ్లి అడ్డుకోవాలని చూశారని మండిపడ్డారు. అయితే సుప్రీంకోర్టు కూడా వారి పిటిషన్ ను కొట్టేసిందని సీఎం వివరించారు.గ్రూప్ 1 ఉద్యోగాలకు ఎంపికయిన 31,383 మందిలో 10శాతం లోపు మాత్రమే అగ్రవర్ణాలకు చెందిన అభ్యర్థులు ఉన్నారన్న సీఎం.. 57.11 శాతం బీసీలు,15.38 శాతం ఎస్సీలు, 8.87 శాతం ఎస్టీలు, 8.84 ఈడబ్ల్యూఎస్ కోటాలో, అలాగే స్పోర్ట్స్ కోటాలో 20 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని చెప్పారు.గాంధీ కుటుంబం ఒక మాట ఇస్తే హరిహరాదులు అడ్డు వచ్చినా అది నెరవేర్చి తీరుతుందని సీఎం వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ శ్రేణులందరూ మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ ఇచ్చిన మాటను నిలబెట్టే వారసులన్నారు. రేవంత్ కి ప్రత్యేక గుర్తింపు ఏమీ లేదన్న సీఎం కాంగ్రెస్ పార్టీనే గుర్తింపు ఇచ్చిందనీ మీరంతా కష్టపడితేనే నాకు ఈ బాధ్యత వచ్చిందని కాంగ్రెస్ శ్రేణులను ఉద్దేశించి చెప్పారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఎజెండాతోనే ప్రజల్లోకి వెళ్లామన్న సీఎం పార్టీ విధానాన్ని అమలు చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. పని చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉన్నా ప్రతీ క్షణం సమన్వయం చేసుకోవాల్సిన బాధ్యత కాంగ్రెస్ శ్రేణులు, నేతలపై ఉందని రేవంత్ రెడ్డి వెల్లడించారు.

టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ కులగణన నిర్వహణపై సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సాహసోపేత నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. దీనికి పార్టీ శ్రేణులు అండగా నిలబడి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. నవంబర్ 2న 33 జిల్లాలో కులగణనపై డీసీసీ అధ్యక్షులు సమావేశాలు ఏర్పాటు చేసి పెద్దఎత్తున ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. విద్య, ఉద్యోగ, రాజకీయ విభాగాల్లో కుల గణనపై ఎలాంటి అనుమానాలు ఉన్నా గాంధీభవన్‌లో ఒక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి సమాచారం ఇస్తామని పార్ట చీఫ్ స్పష్టం చేశారు. సామాజిక న్యాయం కోసం రాహుల్ గాంధీ అహర్నిశలు కృషి చేస్తున్నారని చెప్పారు. భారత్ జోడో యాత్రలో రాహుల్ గాంధీ కులగణనపై స్పష్టమైన ప్రకటన చేశారని వెల్లడించారు. ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే కులగణన చేపట్టాలని ఆదేశాలు ఇచ్చారన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహించనున్న సామాజిక, సమగ్ర సర్వే ఆర్థికంగా వెనకబడిన వారికి చేయూత ఇచ్చేందుకు ఉపయోగపడుతుందన్నారు. కులగణన తో ఇంకా వెనకబడిన వర్గాల కోసం ఎలాంటి సంక్షేమ పథకాలు అమలు చేయాలో అనే దానిపై చర్చించేందుకు సమావేశం ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ మేరకు త్వరలోనే అన్ని జిల్లాల్లో డీసీసీ అధ్యక్షులతో సమావేశాలు నిర్వహిస్తామన్న భట్టి.. రాష్ట్ర స్థాయిలో పార్టీలకు అతీతంగా మరో సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. ఈ మేరకు వచ్చే నెల ఐదో తేదిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ హైదరాబాద్ కు వచ్చే అవకాశం ఉందనీ ఆయనతో కులగణనపై మరో సమావేశం ఏర్పాటు చేస్తామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కులగణన పై చర్చ జరగకుండా ప్రతిపక్షాలు కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



# అయ్యో..?!

**(మొదటిపేజీ తరువాయి)** అనాలనిపిస్తున్నది. సమయమెప్పుడు ఒకేలా ఉండదు., సందర్భం ఎప్పటికీ కలిసొస్తుందనే ఆశలూ పెట్టుకోవద్దు. ఎప్పటి అవసరం అప్పటిదే. మెచ్చుకుంటున్నారు కదా అని తప్పుడు పనులకు సైతం సై అంటే., ఆ తర్వాత తీర్చిదిద్దుకోలేని గందరగోళంలో ఇరుక్కోవాల్సిందే. తెలంగాణలో పలువురు ఐఏఎస్ ల పని తీరు వివాదాస్పదంగా మారింది. గత ప్రభుత్వ హయాంలో వారు తీసుకున్న నిర్ణయాలు వారి ఉద్యోగాలను ప్రమాదంలో పడేశాయి. ఇప్పటికే రంగారెడ్డి జిల్లా పరిధిలో ఉన్న ప్రభుత్వ, భూదాన్ భూములను అప్పనంగా తక్కువ ధరకే ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న ఐఏఎస్ అధికారి అమోయ్ కుమార్ పై ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టర్ (ఈడీ) విచారణ వేగవంతం చేసింది. ఈ ఘటన మరువక ముందే తాజాగా అమోయ్ సహా మరో ఐఏఎస్ నవీన్ మిట్టల్, మాజీ ఐఏఎస్ సోమేష్ కుమార్‌పై కొండాపూర్ వాసులు భూ అక్రమ వ్యవహారంపై ఈడీ అధికారులకు ఫిర్యాదు చేయడం కలకలం రేపింది. బుధవారం బషీర్ బాగ్ లోని ఈడీ కార్యాలయానికి చే రుకున్న కొండాపూర్ వాసులు నవీన్ మిట్టల్, సొమేశ్ కుమార్ అక్రమ భూబాగోతంపై ఫిర్యాదు చేశారు. మీజీద్ బండి లో ఉన్న 88 ఎకరాలను బాలసాయి ట్రస్ట్ కు ఓ కుటుంబం దానం చేసిందని ఫిర్యాదుదారులు ట్రస్ట్ భూమిపై కన్నేశారని వివరించారు. అదే భూమిలో నుంచి భూపతి అసోసియేట్స్ అనే ప్రైవేటు సంస్థకు కేటాయిస్తూ అక్రమంగా జీవో నెం.45ను జారీ చేశారంటూ బాధితులు ఈడీకి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. తమ భూమికి సంబంధించి ముగ్గురు ఐఏఎస్ లు ఫేక్ డాక్యుమెం ట్లు సృష్టించి మోసం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇదీలావుంటే మాజీ సీఎస్ సోమేశ్ కుమార్ వరుసగా చిక్కుల్లో పడుతున్నారు. ఇప్పటికే జీఎస్టీ కుంభకోణంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న





ఆయనపై కొండాపూర్ లో ఓ భూ వివాదం వ్యవహారంలో నేరుగా ఈడీకి ఫిర్యాదు అందడం కలకలం రేపుతున్నది.

**అసలేం చేశారు..?**

బీఆర్ఎస్ ప్రభుత్వంలో తీసుకువచ్చిన ధరణితో భూ అక్రమాలు జరిగాయని కాంగ్రెస్ ప్రభుత్వం దానిపై విచారణ సాగిస్తున్నది. ధరణిని మార్చి కొత్తగా ఆర్ ఓ ఆర్ యాక్ట్ ను తీసుకువస్తున్నది. ఈ నేపథ్యంలోనే పలు భూ అక్రమాలు బయటకు వస్తున్నాయి. రంగారెడ్డి జిల్లాలో ఇలాంటి అక్రమాలు ఎక్కువ జరిగినట్లు ఆరోపణలున్నాయి. దీంతో అప్పుడు కలెక్టర్ గా వ్యవహరించిన అమోయ్ కుమార్‌ను విచారణ చేస్తున్నారు. ఏకంగా ఈడీ వద్దకు ఈ వివాదం చేరింది. అయితే, కలెక్టర్ గా వ్యవహరించిన అమోయ్‌తో పాటుగా సీసీఎల్ఏ బాధ్యతలు నిర్వర్తించిన నవీన్ మిట్టల్, సీఎస్ గా ఉన్న సోమేశ్ కుమార్ కు కూడా ఈ అక్రమాల్లో భాగం ఉన్నట్లు విమర్శలున్నాయి.

**గతంలోనే సోమేశ్ పై ఈడీ..**

రాష్ట్రంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఐజీఎస్టీ కుంభకోణంలోకి ఈడీ రంగ ప్రవేశం చేసింది. గతంలో సీసీఎస్ పోలీసులు కేసు నమోదు చేశారు. భారీ స్థాయిలో నగదు అక్రమ చెలమణి జరిగినట్లు గుర్తించిన ప్రభుత్వం కేసును సీఐడీకి అప్పగించింది. అయితే తాజాగా ఈడీ సైతం రంగంలో కి దిగింది. వారందరిపై కేసులు సైతం నమోదు చేసి షాక్ ఇచ్చింది. ఏ1గా వాణిజ్య పన్నుల అదనపు కమిషనర్ కాశీ విశ్వేశ్వరరావు, ఏ2గా ఉప కమిషనర్ శివరామ్ ప్రసాద్, ఏ3గా హైదరాబాద్ ఐఐటీ ప్రొఫెసర్ శోభన్ బాబు, ఏ4గా ప్లియంటో టెక్నాలజీస్, ఏ5గా మాజీ సీఎస్ సోమేశ్ పై కేసు బుక్ చేశారు.

**ఖజానాకు భారీగా గండి..**

ఐజీఎస్టీకి సంబంధించి దాదాపుగా రూ.1400 కోట్ల మేర ఐటీసీని క్లెయిమ్ చేశారు. ఫలితంగా సర్కారు ఖజానాకు గండి పడ్డట్లు సీసీఎస్ పోలీసులు తమ ప్రాథమిక విచారణలో నిగ్గు తేల్చారు. బోగస్ ఇన్వాయిస్‌లతో ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ ను క్లెయిమ్ చేశారని కమర్షియల్ ట్యాక్స్ డిపార్ట్ మెంట్ గతేడాది చేపట్టిన ఆడిట్‌లో భాగంగా గుర్తించింది. వస్తువుల పంపిణీ చేయకపోయినా, తప్పుడు ఇన్వాయిస్‌లను సృష్టించినట్లు గుర్తించారు. రూ.వేల కోట్లలో స్కామ్ జరిగిందని ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చిన ప్రభుత్వం, పూర్తిస్థాయి దర్యాప్తు కోసం కేసును సీఐడీకి అప్పగించింది.

**సోమేష్ కుమార్ పైనే అనుమానం..**

బీఆర్ఎస్ ప్రభుత్వంలో చీఫ్ సెక్రటరీగా, వాణిజ్య పన్నుల శాఖ ప్రధాన కార్యదర్శిగా సోమేశ్‌కుమార్ చక్రం తిప్పారు. ఆయన కనుసన్నల్లోనే తాము సాఫ్ట్ వేర్ లో మార్పులు చేసేందుకు అంగీకరించామని కాశీవిశ్వేశ్వరరావు, శివరామప్రసాద్ అంగీకరించినట్లు సీసీఎస్ పోలీసులు అప్పట్లోనే బహిర్గతం చేశారు. స్పెషల్ ఇనిషియేటివ్స్ పేరిట సోమేష్ కుమార్ ఏకంగా ఓ వాట్సాప్ గ్రూపు సైతం ఏర్పాటు చేశారు. దీని ద్వారానే సమాచారాన్ని ఇచ్చి పుచ్చుకునేవారని సీసీఎస్ పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. సోమేష్ సహకారంతోనే 75 సంస్థలకు సంబంధించి ఐటీ రిటర్నుల సమాచారం తెలియకుండా చేసేందుకు సాఫ్ట్ వేర్ ను మార్చారని, ఫలితంగా ఐటీసీ క్లెయిమ్‌లకు వీలు కల్పించారన్నారు. ఈ క్రమంలోనే సుమారుగా రూ.1400 కోట్ల మేర ఐటీసీ సొమ్మును క్లెయిమ్ చేసుకున్నట్లు గుర్తించారు.

**ఇ - రేస్ లో అరవింద్ కుమార్...**

ఇ – రేస్ వ్యవహారంలో ఐఏఎస్ అరవింద్ కుమార్ పై అభియోగాలు నమోదయ్యాయి. కేటీఆర్ నోటి మాటగా చెప్పడంతో హెచ్ఎండీఏ నిధులను అప్పనంగా అందజేసినట్టు అభియోగాలు నమోదు కావడంతో ఈ సీనియర్ ఐఏఎస్ కూడా కష్టాల్లో కురుకుపోయే పరిస్థితులు నెలకొన్నాయి. సర్కార్ నుంచి ప్రత్యేక ఆదేశాలు లేదంటే జీవో విడుదల వంటివి ఏమీ లేకుండానే నిధులను దారి మళ్లించినట్టు బహిర్గతమయ్యింది. దీంతో ఇ – రేస్ ఇష్యూ ఈయన మెడకు చుట్టుకునే ప్రమాదాలు పొంచి ఉన్నాయి.

Printed and Published Mallika. On behalf of Sri Krishna Vande Jagadgurum Publications, Published at Banjara Hills Road , Erramazill 6-3-562-14, Hyderabad - Telangana 500082.
Printing at Colour Graphics, 2-6-652/12, Amberpet Musarambagh Road ,Hyderabad, 500013 Telangana. Editor Sramik (Responsible for selection of News under the PRB act )
Reg no APTEL / 2012/46581, Phone Number 9849290606, Email ID : janapadham0606@gmail.com